ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికీ కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | Tuesday 29 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 165 | Vol.No 28 Issue No .165 | www.visionandhra.in

## దేశ భవిష్యత్తుకు
# నాణ్యమైన విద్య, నైపుణ్యాలే పునాది

- తెలంగాణలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం
- యువతకు ఉద్యోగాలు కల్పించే నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర హక్కులు, సమాన ప్రాతినిధ్యం కోసం పోరాటం కొనసాగుతుంది



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర): దేశ భవిష్యత్తు నిర్మాణానికి నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో అస్సాం దినపత్రిక 'ప్రతిదిన్' నిర్వహించిన కాంక్లేవ్‌లో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై ఆయన మాట్లాడారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ.. 2006లో జడ్పీటీసీగా, 2007లో ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచానని, అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి 2019లో మిగతా 2లో..

# భూ రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

- నవంబర్ 15లోగా రీసర్వే పూర్తి చేయాలి
- నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు
- అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి: మంత్రి పొంగులేటి





వనపర్తి, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దాదాపు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం సమగ్ర రీసర్వే ద్వారా భూ హద్దులు, యాజమాన్య హక్కులు, సాదా బైనామా తదితర దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సోమవారం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రెవెన్యూ, భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్ల పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా రీసర్వే పురోగతిని తహసీల్దార్లు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్న మంత్రి.. రైతుల నుంచి వస్తున్న అభిప్రాయాలపై కూడా ఆరా తీశారు. రీసర్వే ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి దశలో 70 గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నామని, నక్షాలో లేని 413 గ్రామాల్లోనూ సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ముందుగా గ్రామాల సరిహద్దులను పక్కాగా నిర్ధారించిన మిగతా 2లో..

# టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

పలు ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

- అక్టోబర్, నవంబర్ నెలల్లో పరీక్షల నిర్వహణ
- అసిస్టెంట్ సైంటిస్ట్, ఏఈఈ, డీఈవో పోస్టులకు తేదీల ఖరారు
- కంప్యూటర్ ఆధారిత విధానంలో జరగనున్న పరీక్షలు





హైదరాబాద్, సెప్టెంబర్ 28 : తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) మిగతా 2లో..

# బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రూ. 60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు
- రూ. 450 కోట్లతో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ
- నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభం
- ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పెంపు



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ మిగతా 2లో..

## యువత సృజనాత్మకతకు
# బతుకమ్మ ఛాలెంజ్ వేదిక..

## - ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రత్యేక పిలుపు

- యువ ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం..
- ప్రభుత్వ పథకాలు, తెలంగాణ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లదే కీలక పాత్ర



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో విజయవంతంగా మిగతా 2లో..

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ.. గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం
- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా మిగతా 2లో..

# ఇందిరా మహిళా శక్తితో మహిళలకు ఆర్థిక స్వావలంబన, మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- రూ.5కే నాణ్యమైన భోజనం అందించేలా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు
- మహిళా సంఘాలకు రూ.1.20 కోట్ల సున్నా వడ్డీ రుణాలు.. విద్యార్థులకు యూనిఫారాలు
- బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ క్యాంటీన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగించే పేద, సామాన్య ప్రజలకు కేవలం రూ. 5కే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం మహిళలకు ఆర్థిక వృద్ధి సాధించడానికి వారి చేత ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు మిగతా 2లో..

## ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం
# మామూలుగా ఉండదు

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో నిర్ణయాత్మక ఫలితం వస్తుందని దానం జోస్యం
- ఈసీని వాడుకుని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్
- ఉపఎన్నికలో పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన దానం



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలో వచ్చే తీర్పు నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. మిగతా 2లో..

## కాలుష్యంపై
# ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

## - నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు

- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

మిగతా 2లో..

## ప్రతిభకు ప్రోత్సాహం..
# అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి
- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ
- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా
- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ
- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి



అమరావతి, సెప్టెంబర్ 28 : ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మిగతా 2లో..

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం..
# ఇంకా ధర్నాలెందుకు?

- సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి
- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



అమరావతి, సెప్టెంబర్ 28 : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. మిగతా 2లో..

## బహదూర్‌పల్లి రైతులకు
# అండగా నిలుస్తాం

- బహదూర్‌పల్లి రైతుల భూములపై రియల్ ఎస్టేట్ దందా చేస్తే ఊరుకునేది లేదు
- బుల్లెట్ ట్రైన్‌కు వ్యతిరేకం కాదు.. రైతులకు న్యాయం చేయాలి
- 4 వేల మంది పోలీసులను ఎందుకు మోహరించారు?: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర): బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బహదూర్‌పల్లి రైతులతో ఆయన సమావేశమయ్యారు. రైతుల భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన పత్రాలతో ముందుకు రావాలని, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. రైతుల ఇళ్ల వద్దకు పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించడంపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వం వద్ద భూములకు సంబంధించిన పత్రాలు, మిగతా 2లో..

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం..

# ఇంకా ధర్నాలెందుకు?

సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు. కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం

# మాములుగా ఉండదు

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దానం నాగేందర్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ 'ఓట్ల దొంగతనం' చేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఖైరతాబాద్ సీటు ఫలితాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదని ఆయన స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దానం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు.పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..
# గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరపున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్–1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# ఇందిరా మహిళా శక్తితో మహిళలకు ఆర్థిక స్వావలంబన, మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

చేస్తుంది ప్రభుత్వం తరపున అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ శాశ్వత నిర్మాణాలతో, అన్ని సౌకర్యాలతో క్యాంటీన్లను అభివృద్ధి చేస్తున్నాం.ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉంది. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యం. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కూడా పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని కోరుతున్నాను.ప్రభుత్వం మహిళా సంఘాలకు గతంలో రూ.5 లక్షల వరకు అందించిన వడ్డీలేని రుణ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచింది. గత మూడు సంవత్సరాలుగా వడ్డీలేని రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది.మహిళా సంఘాల ద్వారా ఇందిరమ్మ క్యాంటీన్లు నిర్వహించడంతో పాటు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కూడా అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే 600 బస్సులకు మహిళలను యజమానులను చేసింది పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా సంఘాలకు ఈ అవకాశాలను విస్తరించాలనే ఆలోచన ఉంది. హైదరాబాద్ నగరంలోని మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు అర్హత ఉన్న సంఘాలను గుర్తించి, 100 శాతం రీపేమెంట్ సామర్థ్యం ఉన్న మహిళా సంఘాలకు అవకాశం కల్పించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ గారిని కోరుతున్నాను. అదేవిధంగా బీసీ, మైనారిటీ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుట్టు మిషన్లను అందించే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపడుతోంది. ప్రతి నియోజకవర్గంలో మహిళలకు కుట్టు మిషన్లతో పాటు అవసరమైన శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచి సాంకేతికత కలిగిన నాణ్యమైన కుట్టు మిషన్లను అందించేలా నిర్ణయం తీసుకున్నాం. అర్హత ఉన్న మహిళలు సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నాను. మహిళలు కేవలం కుటుంబానికి పరిమితం కాకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కుటుంబాన్ని ఆర్థికంగా నడిపించే శక్తి, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మహిళలకు రావాలి. మహిళల ఆర్థిక సాధికారతే కుటుంబ సాధికారతకు, తద్వారా సమాజ అభివృద్ధికి పునాది. అందుకే మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వారికి వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు, శిక్షణ, కుట్టు మిషన్లు, క్యాంటీన్లు, బస్సులు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. తెలంగాణలోని ప్రతి అక్కచెల్లెమ్మ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని, స్వయం సమృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# భూ రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

అనంతరం భూముల సర్వే చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రీసర్వే కోసం ఆధునిక రోవర్లను అన్ని జిల్లాలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం నాణ్యతతో సర్వే నిర్వహించి నవంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. రీసర్వేకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని, వారి సందేహాలను క్షేత్రస్థాయిలోనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రైతులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని హెచ్చరించారు. అధికారులు నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి మించి ఎకరాకు రూ.60 చొప్పున చెల్లిస్తున్నామని, ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లింపులు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సర్వేయర్లకు నెలవారీ వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకే ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. తొలి దశలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించామని, రెండో దశలో మరో 2,000 ఇళ్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో జరిగిన తప్పులు రెండో దశలో పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వనపర్తి భూ సమస్యలకు రెండు వారాల్లో పరిష్కారం

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రస్తావించిన సమస్యలపై మంత్రి స్పందించారు. పట్టణ శివారులోని సర్వే నంబర్ 9లో రెవెన్యూ, దేవాదాయ శాఖల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వనపర్తి బైపాస్ రహదారికి సంబంధించి అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూమి కేటాయించినందున మిగిలిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ రెండు అంశాలపై రెండు వారాల్లోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేల విజ్ఞప్తులు

ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు భూముల కేటాయింపు సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. రైల్వే బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంకటాపూర్‌లో అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. మహబూబ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన రాజీవ్ స్వగృహ స్థానంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ప్రస్తావించిన సమస్యలపై మంత్రి స్పందిస్తూ కొత్తకోట మండలం రాఘవేంద్ర కాలనీలోని టెనెంట్ ల్యాండ్ సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశించారు. ఈదులబావితండాలో దేవాదాయ శాఖ భూములుగా నమోదైన భూములకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని సూచించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నియోజకవర్గంలోని పలు రెవెన్యూ భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల అంశాలను పరిష్కరించాలని కోరారు.

అర్జీలు వారం రోజుల్లోగా పరిష్కరించాలి: జూపల్లి

ప్రజల నుంచి వచ్చే అర్జీలను క్రమబద్ధంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రతి నెల ఒక్కో మండలానికి ఒక రోజు కేటాయించి ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, ప్రజల అర్జీల కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు వారం రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి దరఖాస్తుకు తగిన పరిష్కారం చూపేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు.

మక్తల్, ఆత్మకూరుకు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలి: వాకిటి

మంత్రి వాకిటి శ్రీహరి తన నియోజకవర్గంలో మక్తల్, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ప్రతిపాదించిన పవర్ ప్లాంట్‌కు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజల భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, గృహ నిర్మాణ పథకాలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని మంత్రులు సూచించారు.

ఐదు ప్రభుత్వ కార్యాలయాలకు శంకుస్థాపన

సమీక్షకు ముందు వనపర్తి ఐడీఓసీ నుంచి ఐదు ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. శ్రీరంగాపురం, ఆత్మకూరు, వీపనగండ్ల, చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయాలకు ఒక్కొక్కటి రూ.2.25 కోట్ల చొప్పున, వనపర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.2.10 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్నారు. సమావేశంలో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నారాయణపేట కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్‌కుమార్, రిజిస్ట్రేషన్లుస్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలే పునాది

ఎంపీగా గెలిచినట్లు వివరించారు. రాహుల్ గాంధీని కలిసిన సందర్భంలో ఆయనతో సుమారు 15 నిమిషాలు మాట్లాడిన తర్వాత తన రాజకీయ నాయకుడిగా రాహుల్‌ను నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర కీలకం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ పాత్రను సీఎం ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పాటు ద్వారా కాంగ్రెస్‌కు తక్షణ రాజకీయ ప్రయోజనం లేదని, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగానే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తనకు అనేక అవకాశాలు లభించాయని, ఐదేళ్లలోనే ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎదిగే అవకాశం ఆ పార్టీ కల్పించిందని చెప్పారు.

విద్య, నైపుణ్యాలే యువతకు బలమైన భవిష్యత్తు

స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీరు, ఆరోగ్య రంగాలకు పునాది వేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, విశ్వవిద్యాలయాలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల ఏర్పాటుతో దేశ అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నిష్పత్తి దేశ సగటు కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ, ప్రతి ఏడాది వేలాది మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారని చెప్పారు. ఇందుకు కారణాలను అధ్యయనం చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిల నుంచే ఇంగ్లిష్ మీడియం, కమ్యూనికేషన్ స్కిల్స్ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పన్నెండో తరగతి వరకు భాషా నైపుణ్యాలు, ఆ తర్వాత ఉద్యోగాలకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు అందించేలా విద్యా విధానంలో మార్పులు చేస్తున్నామని వివరించారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఉపాధికి బాట

తెలంగాణ నుంచి ఏటా సుమారు 1.80 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తుండగా, వారిలో సుమారు 20 వేల మందికే తగిన ఉద్యోగాలు లభిస్తున్నాయని సీఎం తెలిపారు. విద్యార్థులు కేవలం సర్టిఫికెట్ల కోసం కాకుండా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆనంద్ మహీంద్రా చైర్‌పర్సన్‌గా, శ్రీని రాజు వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని, కార్పొరేట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు డైరెక్టర్లుగా ఉన్నారని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఐటీఐల్లో కాలానుగుణంగా పాత కోర్సులను తొలగించి ఆధునిక నైపుణ్యాలపై దృష్టి పెడుతున్నామని చెప్పారు. టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 86 శాతం నిధులను టాటా సంస్థ, 14 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయని వివరించారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకరించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల విస్తరణ వంటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదని పేర్కొన్నారు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు టెండర్లు పిలిచి రెండేళ్లు గడుస్తున్నా సంబంధిత ఫైల్ ప్రధానమంత్రి కార్యాలయంలోనే ఉందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో విమానాశ్రయం, ఐఎస్‌బీ, ఐఐటీ, నల్సార్ వంటి సంస్థలు, ప్రపంచస్థాయి ప్రతిభావంతులు ఉన్నారని, పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్రానికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలి

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా చూడాలని రేవంత్ రెడ్డి అన్నారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ ప్రాతినిధ్యం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 1976లో లోక్‌సభ స్థానాలను 543 వద్ద స్తంభింపజేసిన నిర్ణయాన్ని, అనంతరం దాని పొడిగింపును ఆయన ప్రస్తావించారు. 2026లో కూడా ప్రస్తుత సంఖ్యను మరో 25 సంవత్సరాలు కొనసాగిస్తే సమస్య ఉండదని అభిప్రాయపడ్డారు. పునర్విభజన ద్వారా జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వస్తే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం కల్పించే విధానమే సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుందని పేర్కొన్నారు.

## బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రిన్సిపాల్ సెక్రటరీ బాలామాయదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే (ఐదీ పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటివరకు 1,30,000 మంది విద్యార్థులకు ₹450 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు.

₹60 కోట్లతో 'కాటమయ్య రక్షణ కవచాలు'

గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన 'కాటమయ్య రక్షణ కవచాలు' పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం ₹60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉన్నతి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను సూచించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతల (ఇన్‌స్టాల్‌మెంట్స్) రూపంలో 180 మంది విద్యార్థులకు ₹18 కోట్ల 40 లక్షల నిధులను విడుదల చేశామని చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

**CHANGE OF NAME**

I, **DODDA GEETHA** D/o **DODDA SUBBARAO,** Aadhaar Card Number **719698504107,** hereby changing my name and henceforth in future I would be known as **BHAGAVATI GEETHA SRI THRAYAMBAKA PRIYA** W/o **BHAGAVATI SHARANU BHAIRAVA BHUVANESHWARI SRI KRISHNA,** (NEW NAME), **Road No.2, Plot No.1,** Cheeryala, Medchal-501303, Telangana.

**BHAGAVATI GEETHA SRI THRAYAMBAKA PRIYA W/o BHAGAVATI SHARANU BHAIRAVA BHUVANESHWARI SRI KRISHNA**

Place : Cheeryala     Date : 28-09-2026

## ప్రతిభకు ప్రోత్సాహం..

# అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు. అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# యువత సృజనాత్మకతకు బతుకమ్మ ఛాలెంజ్ వేదిక..

జరిగింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో, ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు, వివిధ విభాగాలు, పాల్గొనే విధానం తదితర అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం యువ కళాకారులు, కంటెంట్ క్రియేటర్లు, ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్ఫ్లుయెన్సర్లు విస్తృతంగా భాగస్వాములు కావాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలనకు సంబంధించిన సమాచారాన్ని సృజనాత్మక డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని సమావేశంలో పేర్కొన్నారు. ఇన్ఫ్లుయెన్సర్ల విభాగంలో తెలంగాణ ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలనపై రీల్స్, డిజిటల్ స్టోరీటెల్లింగ్ ద్వారా కంటెంట్ రూపొందించేందుకు అవకాశం కల్పించారు. యువ ఫిల్మ్ మేకర్లు, ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి, అనిల్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విద్యాసంస్థల్లో రాజకీయ కాలుష్యం

విద్య ప్రాథమిక లక్ష్యం విజ్ఞానాన్ని అందించడం మాత్రమే కాదు; జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఒత్తిళ్లను స్థిరచిత్తంతో ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని, శీల నిర్మాణాన్ని పెంపొందించడం.స్వామి వివేకానంద చెప్పిన మాటలు విద్యా వ్యవస్థకు మూల స్తంభం లాంటివి. అయితే భారతీయ విద్యావ్యవస్థ నేడు ఒక విచిత్రమైన, విచారకరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు అంతర్జాతీయ వేదికలపై భారతీయ మేధోసంపత్తి, ఐఐటీ , ఐఐఎమ్ గ్రాడ్యుయేట్లు ప్రపంచ మార్కెట్ ను శాసిస్తుంటే.. మరోవైపు అవే దేశీయ విద్యా సంస్థలు రాజకీయ స్వార్థానికి, మానసిక సున్నితత్వానికి , సిద్ధాంతపరమైన కుట్రలకు బలైపోతున్నాయి. విద్యాలయాలు అంటే కేవలం జ్ఞానాన్ని పంచే దేవాలయాలు మాత్రమే కాదు, విద్యార్థి భవిష్యత్తుకు అవసరమైన క్రమశిక్షణను నూరిపోసే కేంద్రాలు. కానీ, దురదృష్టవశాత్తు నేడు ప్రతి చిన్న చేదు అనుభవాన్ని, తప్పు చేసినప్పుడు పట్టుబడిన క్షణాన్ని 'కులం' కోణంలోనో, వ్యవస్థీకృత వేధింపుల రూపంలోనో రంగు పూసి రాజకీయ రొంపిలోకి లాగడం సర్వసాధారణమైపోయింది. ఐఐటీ బాంబేలో ఇటీవల చోటుచేసుకున్న ఒక విషాదకర సంఘటన ఈ రుగ్మతకు అద్దం పడుతోంది.దేశంలోనే అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థగా, జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసే ప్రతి ప్రతిభావంతుడైన విద్యార్థి మొదటి కలగా భావించే ఐఐటీ బాంబే లో ఇటీవల సాహిల్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంగ్రాంతిని కలిగించింది. అయితే, ఈ ఆత్మహత్య వెనుక ఉన్న ప్రాథమిక కారణాలను నిష్పాక్షికంగా విశ్లేషిస్తే అసలు నిజం బయటపడుతుంది. పరీక్షా హాలులో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ ఇన్విజిలేటర్‌కు దొరికిపోవడంతో, దానికి భయపడి , ఆ క్షణంలో వచ్చిన తీవ్ర ఒత్తిడిని, అవమానాన్ని తట్టుకోలేక ఆ విద్యార్థి ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. నిబంధనల ప్రకారం మొబైల్ స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయడం మినహా ఇన్విజిలేటర్ చేసింది ఏమీ లేదు. విధి నిర్వహణలో భాగమైన ఒక సాధారణ క్రమశిక్షణా చర్యను తప్పుగా అర్థం చేసుకుని విద్యార్థి తీసుకున్న తొందరపాటు నిర్ణయం విచారకరమే అయినప్పటికీ, దానికి ఇన్విజిలేటర్‌ను , సంస్థను బాధ్యులను చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. కానీ, దురదృష్టవశాత్తు ఇక్కడే మన రాజకీయ రాబందులు రంగ ప్రవేశం చేశాయి. సదరు విద్యార్థి దళిత నేపథ్యం కలిగినవాడు కావడమే ఆలస్యంగా, దాన్ని ఆసరాగా చేసుకుని తప్పు చేసిన విద్యార్థిని వెనుకేసుకురావడం మాత్రమే కాకుండా.. నేరుగా కుల రాజకీయాన్ని తోడేశారు. తప్పును దిద్దాల్సిన చోట విక్టిమ్ కార్డ్ ఉపయోగిస్తూ, నిబంధనల ప్రకారం వ్యవహరించిన ఇన్విజిలేటర్లు, ప్రొఫెసర్లపై ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వేధింపుల కేసులు నమోదు చేసేంతవరకు వ్యవహారాన్ని దిగజార్చారు. తప్పు చేసినప్పుడు పట్టుబడటాన్ని ఒక సాధారణ క్రమశిక్షణా అంశంగా చూడకుండా, దానికి కులాన్ని రుద్ది రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం విద్యా వ్యవస్థకే అతిపెద్ద విపత్తుగా మారింది. ఒకప్పుడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల చేతుల్లో చింతబరికెలు, బెత్తాలు కనిపించేవి. అవి విద్యార్థులపై కక్ష సాధించడానికో, శారీరకంగా హింసించడానికో ఉపయోగించినవి కావు; కేవలం వారి భవిష్యత్తును దిద్ది తీర్చడానికి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా నిలబెట్టడానికి వేసిన క్రమశిక్షణా అడుగులు. నాడు ఉపాధ్యాయుల చేతిలో దెబ్బలు తిన్న ఏ ఒక్కరూ ఈనాడు దాన్ని వేధింపులుగానో, ఆత్మాభిమానానికి జరిగిన భంగంగానో భావించరు. ఆ రోజు నా మాస్టారు నన్ను సరిదిద్దకపోయి ఉంటే, నాలుగు దెబ్బలు వేసి దారిలో పెట్టకపోయి ఉంటే నేను ఈ రోజు ఈ ఉన్నత స్థాయిలో ఉండేవాడిని కాదు అని నేటి సమాజంలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు సగర్వంగా చెప్పుకోవడమే ఆనాటి విద్యావిధానం సాధించిన విజయానికి సాక్ష్యం. కానీ, నేడు పాఠశాలల్లో ఆనాటి విద్యా వాతావరణం పూర్తిగా రూపుమాసిపోయింది. ఉపాధ్యాయుడి చేతిలో బెత్తం ఉండటం దేవుడెరుగు, కనీసం చేతిలో ఉన్న చాక్‌పీస్‌ను కూడా గట్టిగా విసిరి కొట్టలేని, హెచ్చరించలేని పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లాడిని కొట్టకూడదు, తిట్టకూడదు, చివరికి గట్టిగా అరవకూడదు అంటూ కార్పొరేట్ సంస్కృతి తెచ్చిన కఠినమైన నిబంధనలు ఉపాధ్యాయుల చేతులను, నోళ్లను కట్టేశాయి. టీచర్ తరగతి గదిలో విద్యార్థిని చిన్నగా మందలించినా సరే, మరుసటి రోజే తల్లిదండ్రులు బడిపైకి దండయాత్రకు వస్తూ రచ్చ చేస్తున్నారు. యూనివర్సిటీల్లో చోటుచేసుకునే ప్రతీ విచారకర సంఘటనను, విద్యార్థుల వ్యక్తిగత మానసిక ఒత్తిళ్లను , నైతిక లోపాలను విస్మరించి, దాని వెనుక కుల వివక్ష ఉందనే నెరేటివ్‌ను రుద్దడం నేడు రాజకీయ పక్షాలకు ఒక లాభదాయకమైన ట్రెండ్‌గా మారింది. గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు వచ్చి చేసిన రాజకీయ రచ్చ, ఆ తదనంతర పరిణామాలు దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను ఏ రీతిలో అస్థిరపరిచాయో మనమందరం చూశాం. ఈ రాజకీయ జోక్యం వల్ల విద్యాలయాల అంతర్గత వాతావరణం, విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. మన దేశానికి చెందిన అత్యున్నత విద్యా సంస్థలపై నిరంతరం ఇటువంటి రాజకీయ బురదజల్లే ప్రచారాలు సాగడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో భారతీయ విద్యా ప్రమాణాల పట్ల ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మన సంస్థలు పోటీపడుతున్న తరుణంలో, క్యాంపస్‌ల నిరంతర రాజకీయ అశాంతి వల్ల విదేశీ పరిశోధనలు, పెట్టుబడులు, అంతర్జాతీయ విద్యార్థుల ఆగమనం దెబ్బతింటాయి. రాజకీయ నేతలు తమ స్వల్పకాలిక ఓటు బ్యాంక్ ప్రయోజనాల కోసం స్వతంత్ర విద్యావ్యవస్థలను బలిపశువులను చేయడం తక్షణమే ఆపకపోతే, దేశీయ మేధో రంగానికి పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ? సిలికాన్ వ్యాలీ నుంచి గ్లోబల్ హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ల వరకు ? ఉన్నత స్థానాల్లో ఉన్న భారతీయులు ఇదే భారతీయ విద్యా వ్యవస్థలో చదువుకుని పైకి వచ్చినవారే! మన విద్యావ్యవస్థలో ఎన్నో ప్లస్ పాయింట్లు ఉన్నాయి. అయితే, కాలానికి తగినట్లుగా విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను, పరాజయాలను, విమర్శలను ఎదుర్కొనే రెసిలియెన్స్, మానసిక పరిణతిని నేర్పేలా విద్యావిధానం మారాలి. అంతేకాకుండా, రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం విద్యాసంస్థలను వాడుకోవడం తక్షణమే ఆపాలి. రాజకీయ నాయకులు ఈ దేశానికి అంతగా ఏం మేలు చేశారో తెలియదు కానీ, క్యాంపస్‌లలో కుల, మత, సిద్ధాంత విషబీజాలు నాటి పూడ్చలేనంత నష్టం మాత్రం చేస్తున్నారు. మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బడులను, కళాశాలలను, ఐఐటీలను ఆ రాజకీయ కాలుష్యం నుంచి విముక్తి చేస్తే చాలు.. మన విద్యావ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మానవ వనరులను తయారు చేసి దేశానికి అంతకంటే గొప్ప సేవ చేస్తుంది!

# ఇంట్లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఇద్దరికి గాయాలు

## అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఓ ఇల్లు దగ్ధమైంది



నిజామాబాద్ సెప్టెంబర్28:( విజన్ ఆంధ్ర)అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది.నగరంలోని పూలాంగ్ సమీపంలోని హన్మాన్ నగరంలో సోమవారం ఉదయం ఓ ఇంట్లో మంటలు లేచాయి. ఒక్కసారిగా ఇల్లంతా మంటలు రావడంతో దట్టంగా పొగ నిండుకుంది. స్థానికులు గమనించి వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఫైర్ సిబ్బంది డీఎఫ్‌వో పరమేశ్వర్, జిల్లా ఫైర్ అధికారి శంకర్ నేతృత్వంలో సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వారిని వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# సోమశిల గీతానికి ప్రతిష్ఠాత్మక పురస్కారం

- నల్లమల అందాలను ఆవిష్కరించిన రేలారే ప్రసాద్ గీతానికి బెస్ట్ టూరిజం ఫిల్మ్ అవార్డు
- మంత్రి జూపల్లి చేతుల మీదుగా పురస్కారం



హైదరాబాద్ సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : నల్లమల ప్రకృతి సోయగాలు, సోమశిల అందాలను అక్షర, స్వర రూపంలో ఆవిష్కరించిన ప్రముఖ యువ కవి, గాయకుడు రేలారే ప్రసాద్ రచించి, ఆలపించిన సోమశిల గీతానికి ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. నల్లమల ప్రకృతి అందాలు, సోమశిల సోయగాలు, కృష్ణమ్మ పరవళ్లను తన సాహిత్యం, స్వరంతో ఆవిష్కరిస్తూ రేలారే ప్రసాద్ ఈ గీతాన్ని రూపొందించారు. ప్రకృతి ప్రేమతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గీతంలో ప్రతిబింబించారు. ఈ సందర్భంగా రేలారే ప్రసాద్ మాట్లాడుతూ పుడమి, ప్రకృతి మనకు ఎంతో ఇచ్చాయని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నల్లమల, సోమశిల ప్రకృతి అందాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ గీతాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, పర్యాటక శాఖ ప్రకటించిన బెస్ట్ టూరిజం ఫిల్మ్ అవార్డు 2026లో బెస్ట్ ఎక్సలెన్స్ అవార్డు ఫిల్మ్ కేటగిరీలో సోమశిల బెస్ట్ ఫిల్మ్‌గా ఎంపికైంది, శిల్పారామంలో జరిగిన అవార్డు కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా రేలారే ప్రసాద్ పురస్కారం అందుకున్నారు. ఇప్పటికే విడుదలైన సోమశిల ప్రచార చిత్రం సాహిత్య, సంగీతాభిమానులను ఆకట్టుకుంది. నల్లమల ప్రకృతి వైభవాన్ని గీతం, దృశ్యరూపంలో ఆవిష్కరించిన ఈ చిత్రానికి పురస్కారం లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# విమలక్క పాట జనగొంతుకై ఐదు దశాబ్దాలు

- మట్టిమనుషుల మాటగా మార్మోగిన ప్రజా స్వరం
- ఘనంగా ప్రారంభమైన యాభై గంటల ప్రజా కళాజాతర



హైదరాబాద్ సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : మట్టిమనుషుల జీవితాలను పాటగా మలిచి ప్రజల కష్టాలు, కన్నీళ్లు, పోరాటాలకు స్వరమై. ఐదు దశాబ్దాలుగా ప్రజల మధ్య తన పాటను వినిపిస్తున్న ప్రజా గాయని విమలక్క కళా ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ యాభై గంటల ప్రజా కళాజాతర ఘనంగా ప్రారంభమైంది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి వేలాది మంది కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ జానపద, ప్రజా కళారూపాల ప్రదర్శనలతో సాగిన ర్యాలీకి ఉభయ తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు నాయకత్వం వహించారు. ర్యాలీ అనంతరం ఆర్టీసీ కళ్యాణ మండపంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జెండాను సీనియర్ కార్యకర్త అంబిక ఆవిష్కరించారు. మల్సూర్ ఓ అరుణ పతాకమా గీతాన్ని ఆలపించారు. విమలక్క యాభైఏళ్ల పాటల ప్రస్థానం, ప్రజా కళా ప్రయాణాన్ని ప్రతిబింబించే ఫొటో గ్యాలరీని ప్రొఫెసర్ శాంతా సిన్హా ప్రారంభించారు. విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, బహుజన బతుకమ్మ తదితర కార్యక్రమాల్లో విమలక్క సాగించిన కళా ప్రయాణాన్ని ఛాయాచిత్రాల ద్వారా ఆవిష్కరించారు. ప్రజా కళాజాతర సభను అంకురం సినిమా దర్శకుడు ఉమామహేశ్వరరావు ప్రారంభించారు, ప్రజా సంస్కృతి ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ నిజం వైపు నిలబడుతుందని అన్నారు. ఐదు దశాబ్దాలుగా ప్రజల మధ్య ఉంటూ, వారి జీవితాలను తన పాటతో పలికించిన విమలక్క కళా ప్రయాణం ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. జానపద కళా రూపాలు ప్రజల గుండె చప్పుడని, వాటిని కాలానుగుణంగా తీర్చిదిద్ది రాబోయే తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ప్రజా సంస్కృతికి మద్దతుగా నిలవాలని కోరారు, కార్యక్రమంలో విమలక్క నేతృత్వంలో సిగ్నేచర్ డ్యాన్స్, అమరులకు నివాళిగా వీరుల సన్నిధి పాటను ప్రదర్శించారు. వీరనారి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రముఖ జర్నలిస్టు భాషా సింగ్ పాల్గొన్నారు. ప్రజా కళాజాతర ఆహ్వాన సంఘం ప్రముఖులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రొఫెసర్ చక్రధరరావు, కట్టా భగవంతరెడ్డి, ప్రొఫెసర్ వినయ్‌బాబు, రమేష్ పోతుల, మల్సూర్, ప్రముఖ యువ గాయని మధుప్రియ తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు సమన్వయ కర్తగా వ్యవహరించి కార్యక్రమ కీ నోట్‌ను ప్రవేశపెట్టారు.

# ప్రజావాణికి 100 ఫిర్యాదులు



నిజామాబాద్, సెప్టెంబర్ 28 :(విజన్ ఆంధ్ర) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 100 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ ఇందూరు బల్దియా

**కార్పొరేషన్ బడ్జెట్లో కోట్లు..పనులు మాత్రం శూన్యం**

**ప్రభుత్వం,మేయర్, పీసీసీ అందరూ కాంగ్రెస్సే అయినా అభివృద్ధి ఎక్కడా**

**బల్దియాపై పోరు ఉద్యమంలో ఎమ్మెల్యే ధన్ పాల్ ఫైర్**

**ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయానికి ఎమ్మెల్యే.**

**కార్పొరేటర్లుకమిషనర్ తీరుపై అసహనం**

**తీవ్ర ఉద్రిక్తత..కార్యాలయం ముందు బైఠాయింపు..**



నిజామాబాద్ సెప్టెంబర్28:(విజన్ ఆంధ్ర) అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా నిజామాబాద్ కార్పొరేషన్ మారిందని, ప్రతి బడ్జెట్ మీటింగ్ లో కోట్లు కేటాయిస్తారు కానీ పనుల కోసం రూపాయి ఖర్చు చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. ఎమ్మెల్యేతో పాటు బీజేపీ కార్పొరేటర్లు సోమవారం నగరంలోని ధర్నా చౌక్లో బీజేపీ పోరు ఉద్యమం చేపట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి కోసం ఒక ఎమ్మెల్యే గా ఉండి కూడా ధర్నా చేస్తున్నానంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్పొరేషన్లు 150 కోట్ల ఆదాయం, 94 కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటున్నారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలించినా..మేయర్ వాళ్లే ఉన్నా అభివృద్ధి చేయలేకపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ అభివృద్ధి కొరకు 200 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు విడుదల చేయలేరన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇక్కడి మేయర్ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. నిజామాబాద్ ప్రజలకు నిధులు కాగితాలపై కనిపించడం అవసరం లేదు. ఆ నిధులతో చేసిన రోడ్డు కనిపించాలి, నిర్మించిన డ్రైనేజీలు కనిపించాలి, వెలిగే దీపాలు కనిపించాలన్నారు. కమిషనర్ కు అనేకసార్లు కలిసి లేఖలు అందించినా స్పందించకపోవడం తగదన్నారు. బడ్జెట్ లో డివిజన్ల అభివృద్ధి కొరకు 35 కోట్లు కేటాయించినా..ఇప్పటి వరకు ఒక్క డివిజన్ కు కూడా రూపాయి కేటాయించలేదన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ... ఇందూరు అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నిధులు తీసుకొస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని పథకాల్లో కేంద్రం వాటా ఉందన్నారు. మాధవ నగర్ వంతెనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇందూరు అభివృద్ధి కొరకు గెలిచిన ఎమ్మెల్యేకు నిధులు ఇవ్వకుండా ఓడిన షబ్బీర్లులకి మహేష్ కుమార్ గౌడ్కు పెత్తనం ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. కార్పొరేషన్ ముట్టడి.... ఉద్రిక్తత....బల్దియా సమస్యల పరిష్కారానికి, కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నాచౌక్ లో ధర్నా అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎమ్మెల్యే, బిజెపి కార్పొరేటర్లు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ధన్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వచ్చే వరకు జరిగేది లేదని హెచ్చరించి బైఠాయించారు. అనంతరం కమిషనర్ దిలీప్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు 28 మంది, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, ఆయా మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో పాఠశాల లకు పారిశ్రామిక వేత్త, తన వియ్యంకుడు దయానంద్ రెడ్డి 7 లక్షల విలువైన సామాగ్రి భారీ విరాళం

**ముచ్కూర్, ఎర్గట్ల, పచ్చలనడ్కూడ గ్రామ పాఠశాలలకు సైన్స్ ల్యాబ్ మెటీరియల్ మరియు భీంగల్ కస్తూరిబా గాంధీ పాఠశాల కు 35 డ్యూయల్ డెస్క్ బెంచ్ ల పంపిణి**



నిజామాబాద్ సెప్టెంబర్28:( విజన్ ఆంధ్ర)బాల్కొండ నియోజకవర్గంలోని ముచ్కూర్, ఎర్గట్ల, పచ్చలనడ్కూడ గ్రామాల హైస్కూళ్లకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో తన వియ్యంకుడు పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద్ రెడ్డి గారి సహకారంతో సమకూరిన ఒక్కొకటి 1,80,000 రూపాయల విలువ గల సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను ఈ రోజు వేల్పూర్‌లోని నివాసంలో ఆయా పాఠశాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ల్యాబ్ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే భీంగల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు రూ.1,46,650 విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు.విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వియ్యంకులు దయానంద రెడ్డి గారు ముందుకు రావడం అభినందనీయమని, విద్యా రంగానికి అయన అందిస్తున్న సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి గారు పేర్కొన్నారు. ఉన్నతమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ఇకముందు కూడా అవసరం ఉన్న చోట మా సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# 24 దరఖాస్తులతో ములుగు ప్రజావాణి



ములుగు సెప్టెంబర్ 28;విజన్ ఆంధ్ర ప్రతినిధిములుగు కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 24 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ సంపత్ రావు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.వాటిలో భూ సమస్యలు 15, ఇందిరమ్మ ఇళ్లు 3, ఉద్యోగాలు 4, ఇతర సమస్యలు 2 ఉన్నాయి. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం : కలెక్టర్ హేమంత్

ములుగు సెప్టెంబర్ 28:విజన్ ఆంధ్ర ప్రతినిధి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.సోమవారం రాయినిగూడెం పీహెచ్సీ పరిధిలోని మదనపల్లి గ్రామంలో 'స్వచ్ఛతా హి సేవ-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.చెత్త పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఇంటింటి సర్వే చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. గోపాల్ రావు, వైద్యాధికారులు డా. నాగ అనీష్, డా. దీప్తి, డా. తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య సర్పంచ్ అన్ని తానై అధికారం చెలాయిస్తున్న భర్త

### సర్పంచ్ భర్త పై ప్రజావాణిలో ఫిర్యాదు



నిజామాబాద్ సెప్టెంబర్28:( విజన్ ఆంధ్ర)భార్య సర్పంచ్ గా గెలువగా భర్త అన్ని తానై గ్రామంలో అధికారం చెలాయిస్తున్నరని బందారం సంతోష్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ను కలసి అధికార దుర్వినియోగం చేస్తున్నారంటూ ప్రజావాణిలో విన్నవించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన సర్పంచ్ నీరడి జ్యోతి భర్త నిరడి రవి తానే సర్పంచ్ నంటు అధికారం చలాయించడమే కాకుండా, అధికార కార్యక్రమాలలో పాల్గొంటున్నాడని, ప్రశ్నిస్తే తానే సర్పంచ్ నని చెబుతున్నాడు అన్నారు. అడిగినందుకు టార్గెట్ చేసి షాపు వద్ద ఉన్న మంచినీటి నల్ల ను మూసి వేయించడం జరిగింది అన్నారు. తనకు నచ్చిన వారికి సపోర్ట్ చేస్తూ, నచ్చని వారిని ఇబ్బంది పెడుతున్నారని, ఎలాంటి అధికారం లేకున్నా సర్పంచిగా చలామణి అవుతున్న రవి పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

## ఎన్టీపీసీలో నీటి శుద్ధికి కొత్త సాంకేతికత!!

### క్లోరిన్ డయాక్సైడ్ ప్లాంట్ అందుబాటులోకి
### భద్రత, నాణ్యతకు కొత్త భరోసా
### పర్యావరణ హితమే లక్ష్యంగా ముందడుగు
### ఈడీ చందన్ కుమార్ సమంత





పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర):విద్యుత్ ఉత్పత్తితో పాటు పారిశ్రామిక భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్న ఎన్టీపీసీ రామగుండం మరో కీలక ముందడుగు వేసింది. విద్యుత్ కేంద్రంలోని స్టేజ్–1 క్లోరినేషన్ వ్యవస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లోరిన్ డయాక్సైడ్ ప్లాంట్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించింది. ఎన్టీపీసీ ఆర్అండ్‌టీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ జనరల్ మేనేజర్ మనీష్ అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన ఈ ప్లాంట్ విద్యుత్ కేంద్రంలోని నీటి శుద్ధి ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడనుంది. పారిశ్రామిక కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు పర్యావరణ నిబంధనల అమలుకు ఈ ప్లాంట్ కీలకంగా నిలవనుందిక్లోరినేషన్ ప్రక్రియలో క్లోరిన్ డయాక్సైడ్ వినియోగం ద్వారా నీటి శుద్ధి సామర్థ్యం మెరుగుపడటమే కాకుండా, విద్యుత్ కేంద్రం నిర్వహణలో విశ్వసనీయత పెరగనుంది. పర్యావరణహిత సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ నిర్వహణ, నిర్వహణ సేవలు, ప్రాజెక్టులు, సాంకేతిక విభాగాలకు చెందిన జనరల్ మేనేజర్లు జి.ఎన్. కుల్హాడే, ఎ.కె. బెహరా, బిజోయ్ జోస్, విజయ్ కుమార్ కనౌజియా పాల్గొన్నారు. వీరితో పాటు రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని నూతన ప్లాంట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## సిద్దిపేటలోప్రజావాణి వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ ఆదేశాలు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి28 సెప్టెంబర్( విజన్ ఆంధ్ర) సిద్దిపేట జిల్లాలో ప్రజావాణి ఆర్జీలను వారంలోగా పరిష్కరించి మళ్లీ వచ్చేవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పూర్తి నివేదికలతోహాజరుకావాలని జిల్లా కలెక్టర్ కె హైమావతిఅధికారులనుఆదేశించారు.సోమవారం కలెక్టరేట్సమావేశంమందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజానీ కార్యక్రమానికి వివిధ సమస్యలపై 120 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి అర్జీని పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజలు వారి సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని ఆయా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వారం రోజుల్లోగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొని తీసుకున్న చర్యల నివేదికను వచ్చే వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, సూపర్ ఇంటిండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

### బీర్ల ఐలయ్య, మోతె శోభన్ రెడ్డి,





కాప్రా/సెప్టెంబర్ –27( విజన్ ఆంధ్ర ప్రతినిధి) యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ఫోరం 9వ. ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రను ఉద్యమకారుల పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులు తమ జీవితాలను, సమయాన్ని శక్తిని ధారపోసారని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యమకారుడి సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేకే కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఉగాది ఇన్నయ్య, వెన్నెల, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. చీమ శ్రీనివాస్ రావు,జ్యోతి రెడ్డి,ఉపాధ్యక్షురాలు శ్యామల ముదిరాజ్,దొమ్మటి కిరణ్ కుమార్ రావు, కీర్తి శ్రీనివాస్, దసరం శ్రీనివాస్, బంగారు మల్లేష్ చారీ, శ్రీనివాస్ రెడ్డి,నర్సింహా చారీ, కొండా స్వామి, దయానంద్, సురేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ను రద్దు చేసి అర్హులకు ఓట్ హక్కు కనిపించాలి

### నగర తొలి మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు



నిజామాబాద్ సెప్టెంబర్28:( విజన్ ఆంధ్ర)ఎస్ ఐ ఆర్ ను రద్దు చేసి అర్హులందరికీ ఓట్ హక్కు కల్పించాలని మాజీ తొలి మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ తొలగింపును డిమాండ్ చేస్తూ సోమవారం నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నాయకత్వంలో గాంధీ చౌక్ నుండి ప్రారంభమై, నిజామాబాద్ బస్ స్టాండ్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ముందుగా ధర్మపురి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. డి.సంజయ్ గా ఉన్న పేరును ధర్మపురి సంజయ్ గా రాసినందుకు తొలి మేయర్ అయిన తనకే నోటీసులు పంపించారని గుర్తు చేశారు. మాలాంటి వారికి నోటీసులు ఇస్తున్నారంటే మిగతా వాళ్ళ పరిస్థితి ఏంటి అని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఓట్లు కొల్లగొట్టడమే ఎజెండాగా పనిచేస్తుందన్నారు. వారికి నచ్చిన వారిని మాత్రమే ఓట్లు వచ్చేలా, మిగతా వారి ఓట్లు గల్లంతయ్యి ఎలా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓటు హక్కు కల్పించాం. మేము ఇచ్చిన ఓటర్ ఐడి తోనే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని అన్నారు. ఎస్ ఐ ఆర్ ను రద్దు చేసి అర్హులకు ఓటు హక్కు కల్పించాలన్నారు.ఇవిఎం తొలగించి పాత పద్ధతి ప్రకారం ఓటింగ్ జరిపించాలన్నారు. బీజేపీ చేసిన కుట్రను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల కమిషనర్ గా ఉంటూ బిజెపి తొత్తుగా మారిన జ్ఞానేష్ కుమార్ ను రాజీనామా చేయాలని, చేసేవరకు కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారు. ఈ శాంతియుత ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నల్ల చెరువులో ఘనంగా చేప పిల్లల విడుదల

### ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, శ్రీహరి
### మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
### కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర)వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఇద్దరూ కలిసి నల్ల చెరువు నీటిలో చేప పిల్లలను విడుదల చేశారు.ఃఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మత్స్యకారుల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, చెరువులు, జలాశయాల్లో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. మత్స్య సంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మద్దతునందిస్తుందని పేర్కొన్నారు. ఃఈ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పనులు వేగంగా.. నాణ్యతతో పూర్తి చేయాలి

### ముధోల్ మండల సర్వసభ్య సమావేశంలో
### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
### శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష..
### సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఆదేశాలు




ముధోల్ : సెప్టెంబర్ 28: విజన్ ఆంధ్రముధోల్ మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ పరిధిలో రైతులకు అందుతున్న సేవలు, పంటల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, మౌలిక వసతులు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, తాగునీటి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి, ప్రతి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలుతప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో సాగునీటి వనరులు, నీటి లభ్యత, పెండింగ్ పనులపైకూడాసమీక్షించారు.మండలంలోని వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే సమీక్ష సమావేశం నాటికి గణనీయంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి చేయడమే కాకుండా నాణ్యతతో, ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి పదోన్నతులు

### పత్రాలు అందజేసిన ఎస్పీ డి. సునీతారెడ్డి
### బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పిలుపు







ఃవనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28 (విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది పదోన్నతులు పొందారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి. సునీతారెడ్డి చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులను సిబ్బంది అందుకున్నారు.ఃఇప్పటివరకు ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట నాగరాజు ఎస్సైగా పదోన్నతి పొందగా, హెడ్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న రాజేందర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డిలు ఏఎస్ఐలుగా పదోన్నతి సాధించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు. ఃఅనంతరం ఎస్పీ సునీతారెడ్డి మాట్లాడుతూ... పదోన్నతులు పొందడం సంతోషదాయకమని, అయితే స్థాయితో పాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి బాధితులకు తగిన న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ వనపర్తి జిల్లా పోలీస్ శాఖతో పాటు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలి

### – ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి. దానకిశోర్

### తాగునీరు, రహదారులు, 'జలసిరి' మరియు గ్రామీణ మౌలిక వసతులపై ఉన్నతస్థాయి సమీక్ష



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర)గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి. దానకిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల పరిధిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ దానకిశోర్ మాట్లాడుతూ, హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామ సమైక్య అదనపు భవనాలు మరియు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వి బి – జి –రాం లింక్ రోడ్లకు సంబంధించిన వివరాలను విడివిడిగా నివేదించాలన్నారు. పరిపాలనా అనుమతి పొంది 60 రోజుల కంటే ఎక్కువ సమయం ముగిసినా ఇంకా పనులు ప్రారంభించని అంశాలపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రహదారి పనుల ప్రతిపాదనలను రెండు కేటగిరీలుగా వర్గీకరించాలని సూచించారు: (1) అత్యంత ప్రాధాన్యత కలిగిన మట్టి/లింక్ రోడ్లను బి.టి. రోడ్లుగా మార్చడం, (2) ఉపాధి హామీ కింద నిర్మించే రోడ్ల పనులు.భూగర్భ జలమట్టాలను పెంచేందుకు 'జలసిరి' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి ఊరికి ఊటకుంట తప్పనిసరిగా నిర్మించుకునేలా ప్రజలను, రైతులను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ప్రతి బొట్టునూ సంరక్షించడం ద్వారానే భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని స్పష్టం చేశారు. గ్రామీణ నీటి సరఫరా పథకాల ద్వారా ప్రజలకు నిరంతరాయంగా పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలని, పైప్‌లైన్లు మరియు పంపింగ్ వ్యవస్థల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.సమావేశం అనంతరం ప్రాంగణంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి. దానకిశోర్, జిల్లా కలెక్టర్ మరియు ఇతర విఐపి అతిథులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీటి సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు విస్తృతంగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యతను అధికారులు, స్థానికులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఎన్సీ జగదీష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు మరియు ఇంజినీరింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్ నిర్లక్ష్యంతో బాలికల భద్రతకు ముప్పు

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి




ములుగు సెప్టెంబర్ 28;విజన్ ఆంధ్ర ప్రతినిధిజిల్లా కేంద్రంలోని బాలికల హాస్టళ్లలో వార్డెన్ నిర్లక్ష్యం వల్ల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి ఆరోపించారు. హాస్టళ్లలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థినుల రాకపోకలు, హాజరు, సందర్శకుల వివరాలపై పర్యవేక్షణ ఉండాలని, సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు

## రీ చార్జీలకు 30 రోజుల వ్యాలిడిటీ

### ఏడాదికి 13 నుంచి 12 రీఛార్జ్‌లకు తగ్గింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 28,మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ట్రాయ్ గుడ్ న్యూస్ చెప్పింది. 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు, అలాగే వాయిస్, మెసేజ్ ? మాత్రమే ఉండే ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం కంపెనీలను ట్రాయ్ ఆదేశించింది. టెలికాం వినియోగదారుల సెక్యూరిటీ (13వ సవరణ) నిబంధనలు, 2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా వినియోగదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు

## ములుగు జిల్లా ఆర్ ఎంపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా తోట అనిల్ కుమార్ ఎన్నిక



ములుగు సెప్టెంబర్ 28;విజన్ ఆంధ్ర ప్రతినిధిములుగు జిల్లా కేంద్రంలో ఆర్ ఎంపీ, పీఎంపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ ఎన్ హరిబాబు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తోట అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలని, ఆర్ ఎంపీలను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రాథమిక వైద్య సేవలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు శ్రీలంక.. సంప్రదాయ నృత్యాలతో సాంస్కృతిక వైభవం

డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఆకర్షణీయమైన వేదికగా శ్రీలంకను ప్రమోట్ చేసేందుకు శ్రీలంక టూరిజం ప్రమోషన్ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ రోడ్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో 'ది హెరిటేజ్ ఆఫ్ కండియన్' పేరిట నిర్వహించిన శ్రీలంక సంప్రదాయ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారతదేశం తమకు కీలకమైన పర్యాటక మార్కెట్ అని శ్రీలంక టూరిజం ప్రమోషన్ బ్యూరో చైర్మన్ బుద్ధిక హెవవాసం, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ చమిల జయరత్నే తెలిపారు. కొలంబో, క్యాండీ, నువరా ఎలియా వంటి ప్రాంతాల్లో వివాహాలతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విహారయాత్ర చేసే అవకాశం ఉందని వివరించారు.

# రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి**

**ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు వంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు**

**రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీ.ఎస్ సమీక్ష**



నిజామాబాద్, సెప్టెంబర్ 28 :.( విజన్ ఆంధ్ర ) రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో.సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లు/కళాశాలలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేస్తూ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ కూడా చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సీ.ఎస్ సంజయ్ జాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. తప్పుడు సమాచారం ప్రచారంలో ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా ఏదైనా సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతీ వారం సందర్శిస్తూ, క్షేత్రస్థాయిలో వారు పరిశీలించిన అంశాలను ఎప్పటిప్పుడు నివేదిస్తున్నారని, తదనుగుణంగా రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడ కూడా కలుషిత ఆహారం, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల పర్యవేక్షణ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**వెల్టూరును త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తాం**

**రూ. 22.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు పొంగులేటి, వాకిటి శ్రీహరి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర)ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రూ. 12.75 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్', వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'జ్యోతిభా పూలే బాలుర గురుకుల కళాశాల' భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య, వైద్యం**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అదేవిధంగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడేందుకు, ప్రభుత్వ వైద్య రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చి ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

**సంక్షేమ పథకాల అమలులో వెనకడుగు వేయం**

గత పాలకులు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి వెళ్లినప్పటికీ, గత ప్రభుత్వ పథకాలతో పాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతులను రాజు చేయాలనే ఉద్దేశంతో కనీస మద్దతు ధర, రైతు భరోసా, రుణమాఫీతో పాటు సన్న బియ్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే వేలాది ఉద్యోగాలు కల్పించామని, మరికొన్ని వేల పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. ఆడబిడ్డల ఆర్థిక స్వావలంబన కోసం రూ. 70 వేల కోట్లు సున్నా వడ్డీకే రుణాలుగా ఇస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

**వెల్టూరును మండల కేంద్రంగా చేస్తాం**

స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విజ్ఞప్తి మేరకు వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో కొత్త మండలాలు, డివిజన్ల ఏర్పాటుపై త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు వెల్టూరు గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. అతిపెద్ద గ్రామమైన వెల్టూరును మండల కేంద్రంగా చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఈవో యాదయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు చోరీకి ఈసీ బీజేపీ కాపలా!

**సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి**

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రంపై మంత్రులు పొంగులేటి, జూపల్లి, వాకిటి శ్రీహరి ధ్వజం**

**వనపర్తి కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ భారీ ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర) ఓటు చోరీకి ఎన్నికల సంఘం, బీజేపీ కలసి కాపలా కాస్తున్నాయని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి ఆరోపించారు. బీజేపీకి తొత్తుగా మారి, ప్రజాస్వామ్యంలో పౌరుల ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కుకు భంగం కలిగిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనా రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన ధర్నాలో మంత్రులతో పాటు ఎమ్మెల్యే మేఘా రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓటర్ల జాబితాతో చెలగాటమాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగబద్ధంగా ఓటును కాపాడాల్సిన సీఈసీయే స్వయంగా ఓటు చోరీకి కాపలాదారుగా మారడం శోచనీయమన్నారు. అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్రలను అడ్డుకుంటామని, బీజేపీకి ఎన్నికల సంఘం గుడ్డిగా ఊడిగం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో కలిగిన సందేహాలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కుపై దాడి జరిగితే కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.ధర్నా ముగిసిన అనంతరం మంత్రులు, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు, ఇతర నాయకులు కలసి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్‌పర్సన్ కొల్లే సరిత, మున్సిపల్ ఛైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు మహేశ్వరి, విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయిచరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, నాయకులు జనార్ధన్ సాగర్, కోళ్ల వెంకటేష్, బి. కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, సత్యశిలా రెడ్డి, నక్క రవి కిరణ్, రామ్ రెడ్డి, నరహరి, కృష్ణ యాదవ్, దయాకర్ రెడ్డి, విష్ణు ముదిరాజ్, వాకిటి ఆదిత్య, కోట్ల రవి, అయూబ్ ఖాన్, రాజ్ కుమార్, శ్రీలత రెడ్డి, పాండు సాగర్, గడ్డం వినోద్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంత్రి సీతక్క హామీ



ములుగు సెప్టెంబర్ 28;విజన్ ఆంధ్ర ప్రతినిధిజర్నలిస్టులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ములుగు నూతన కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి సీతక్కను ప్రింట్ మీడియా మిత్రులు కలిసి తమ సమస్యలను వివరించి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ,ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి తొందరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించడంతో ఇళ్ల స్థలాల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు బొమ్మన బోయిన పృథ్వీరాజ్, రామిడి కృష్ణారెడ్డి, గంద్రకోట విష్ణు, కొమురయ్య, జాలిగం శ్రీనివాస్, బిక్కనూరి సుమన్, రాజవర్ధన్, శంకర్, గంగాధర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దేశపు 'రైస్ బౌల్' దాహంతో ఉంది

(ఆకెళ్ళ. విశ్వనాథ్)భారతదేశంలో సమృద్ధిగా పండే వ్యవసాయ పంట 'వరి' నేడు ఆర్థిక వ్యవస్థలో ఒక వైరుధ్యాన్ని ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ధరలు, తీవ్రమవుతున్న నీటి కొరత రెండూ ఒకేసారి ఉండగలుగుతున్నాయి. ఉత్పత్తి 154 మిలియన్ టన్నుల నుండి సుమారు 144 మిలియన్ టన్నులకు తగ్గుతుందని అంచనా వేయడం, ఖరీఫ్ రుతుపవనాలపై ఎక్కువగా ఆధారపడిన పంట యొక్క దుర్బలత్వాన్ని స్పష్టం చేస్తుంది. తగ్గుతున్న వర్షపాతం, తగ్గిన సాగు విస్తీర్ణం భూగర్భ జలాల క్షీణత వంటివి సాంప్రదాయ 'వరి' సాగు వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని బహిర్గతం చేస్తున్నాయి.ప్రభుత్వ నిల్వలు ఆహార భద్రతకు కీలకమైన రక్షణ కల్పిస్తాయి, కానీ అవి చిల్లర ద్రవ్యోల్బణాన్ని వాటంతట అవే నిరోధించలేవు. సంక్షేమం, ఎగుమతులు, పరిశ్రమలు పశువుల మేత నుండి వచ్చే పోటీ డిమాండ్లను తీర్చలేవు, పెరుగుతున్న బియ్యం ధరలు ఇతర ఆహార ఖర్చులను పెంచగలవు. భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన బియ్యం ఎగుమతిదారుగా కొనసాగుతున్నందున, దేశీయ నిర్ణయాలు అంతర్జాతీయ పరిణామాలకు దారితీస్తాయి. అత్యవసర నిల్వల విడుదల లేదా ఎగుమతి నియంత్రణలకు అతీతంగా దీర్ఘకాలిక పరిష్కారం ఉండాలి. నీటిని పొదుపుగా వాడే సాగు, వాతావరణ మార్పులను తట్టుకునే రకాల పంటలను, కొత్తగా రూపొందించిన ప్రోత్సాహకాలు రైతులకు అందిస్తూ, నీటి నిలువలు తరిగిపోకుండా రేపటి బియ్యాన్ని పండించడమే భారతదేశానికి ముందున్న అసలైన సవాలు.

# దేశ స్వాతంత్ర్య కోసం 23 ఏళ్ల వయసులోనే ఉరికొయ్యలను ముద్దాడిన భగత్ సింగ్: కార్తీక్



మల్కాజిగిరి, సెప్టెంబర్ 28,(విజన్ ఆంధ్ర) : 23 ఏళ్ల వయసులోనే ఉరికొయ్యల ను ముద్దాడి ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయ మని జిల్లా జనరల్ సెక్రటరీ కార్తీక్ అన్నారు. మల్కాజిగిరి మండల జెడ్ పీ హెచ్ ఎస్ పాఠశాలలో షహీద్ భగత్ సింగ్ జీవితం, ఆయన సామాజిక దృక్పథం, సోషలిజంపై విశ్వాసం, సంపూర్ణ స్వాతంత్ర్య భావన మరియు నేటి యువతకు ఆయన అందించిన స్ఫూర్తిపై సోమవారం ప్రత్యేక అవగాహనా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జనరల్ సెక్రటరీ కార్తీక్ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. భగత్ సింగ్‌ను కేవలం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే చూడటం ఆయన ఆలోచనలను పరిమితం చేయడమేనని, ఆయన ఒక గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు, యువ విప్లవకారుడు, సామాజిక సమానత్వం మరియు సోషలిజం కోసం ఆలోచించిన మార్గదర్శి అ న్నారు. భగత్ సింగ్ దృష్టిలో స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి రాజకీయ విముక్తి పొందడం మాత్రమే కాదని, పేదరికం, దోపిడీ, కుల–మత వివక్ష, అసమానతల నుంచి కూడా ప్రజలకు విముక్తి లభించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చిన్న వయసులోనే దేశ పరిస్థితులపై ఆలోచించిన భగత్ సింగ్, జలియన్‌వాలా బాగ్ ఘటనతో తీవ్రంగా ప్రభావితమై, దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, విస్తృతంగా పుస్తకాలు చదివి సామాజిక, రాజకీయ అంశాలపై లోతైన అవగాహన పెంచుకున్నారని తెలిపారు. 1929లో బటుకేశ్వర్ దత్‌తో కలిసి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబులు విసిరిన ఘటనను ప్రస్తావిస్తూ, తమ నిరసనను ప్రజలకు వినిపించేందుకు ఆ చర్య చేపట్టారని, అనంతరం పారిపోకుండా అరెస్టుకు లొంగిపోయి కోర్టును, జైలును కూడా తమ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికలుగా ఉపయోగించుకున్నారన్నారు. కేవలం 23 సంవత్సరాల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ నేటి యువతకు ధైర్యం, పఠనం, క్రమశిక్షణ, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత మరియు త్యాగానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. నేటి విద్యార్థులు భగత్ సింగ్ స్ఫూర్తితో తమ యువశక్తిని విద్య, విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ మరియు దేశ నిర్మాణానికి వినియోగించాలని, మాదకద్రవ్యాలు మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి ▪ జీవితానికి, విద్యకు, ఆరోగ్యానికి, మంచి భవిష్యత్తుకు అవును చెప్పండి" అని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. భగత్ సింగ్‌ను స్మరించుకోవడం అంటే కేవలం ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం కాదని, ఆయనలోని పఠనాసక్తి, ఆలోచనా శక్తి, ధైర్యం, సామాజిక న్యాయం పట్ల నిబద్ధతను మన జీవితాల్లో ఆచరించడమే నిజమైన నివాళి అని కార్తీక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మండల కార్యదర్శి యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్, భగత్, జాయింట్ సెక్రటరీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# బసిరెడ్డిపల్లిలో చిరుత పులి కలకలం!

వికారాబాద్ జిల్లా పరిగి మండలం బసిరెడ్డిపల్లిలో శ్రీ శ్రీ మహారాజ యోగి సద్గురు కృష్ణానంద స్వామి వారి 'రాధాకృష్ణ గోవర్ధన గోశాల'పై చిరుతపులి దాడి చేసింది. ఈ గోశాలలో 300లకు పైగా ఆవులు ఉండగా.. మేత కోసం అడవికి వెళ్లిన క్రమంలో చిరుత ఒక ఆవును హతమార్చింది. మరుసటి రోజు కూడా మరో ఆవుపై దాడికి పాల్పడటంతో నిర్వాహకులు, స్థానికులు భయాందోళనలో ఉన్నారు. ఇక దామగొండ అడవుల్లో 'నేవీ రాడార్ స్టేషన్' ఏర్పాట్ల కోసం చెట్లను నరికి వేయడం వల్లే.. వన్యప్రాణులు ఆవాసాలు కోల్పోయి గ్రామాల వైపు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.మూగజీవాల రక్షణ కోసం ఫారెస్ట్ అధికారులు తక్షణమే స్పందించి, చిరుతను బంధించి గోశాలలకు రక్షణ కల్పించాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు."

# ఏఐఎస్ఎఫ్ తొంబై ఏండ్ల పాట ఆవిష్కరణ



కేయూ క్యాంపస్ (విజన్ ఆంధ్ర) :అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు రచించిన ఏఐఎస్ఎఫ్ 90 ఏండ్ల పాటను సోమవారం విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల బహిరంగ సభ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా పాట సీడీని ఆవిష్కరించారు. ఈ పాటను ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా బృందం గానం చేసింది. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు సిపిఐ జిల్లా నాయకులు, ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు ఇస్తారా ఇవ్వరా.. డిప్యూటీ సీఎం భట్టి ఛాంబర్ ముందు కాంట్రాక్టర్ల ఆందోళన..

కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఉద్యోగులతోపాటు కాంట్రాక్టర్లకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపడుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. సెక్రటేరియట్ ముందు కూడా ఇప్పటికే ఉద్యోగులంతా నిరసన కూడా వ్యక్తం చేశారు. తాజాగా కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలి**

**ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులువిద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు**

**శీతాకాలం దృష్ట్యా వెచ్చని నీరు, దుప్పట్లు ముందుగానే అందుబాటులో ఉంచాలి**

**దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు**

**డ్యాష్‌బోర్డ్, ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలి**

**రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**


హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,లి రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల



భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడం పై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు.వీసీ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ... వచ్చే నెల 1 వ తేది నుండి 15 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి... అన్నీ సంక్షేమ హాస్టల్ లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి బుష్ క్లియరెన్స్ చేయాలనీ... అన్నీ హాస్టల్ లో ఎలాంటి పిచ్చి మొక్కలు, చెత్త చేదారం లేకుండా చేయాలన్నారు.ఈ డ్రైవ్ లో పంచాయతీ శాఖ అధికారులు, అన్నీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొని హాస్టల్ లను క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చిద్దిద్దా లన్నారు అలాగే ప్రతీ హాస్టల్ ని సందర్శించి ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాల ప్రస్తుత పరిస్థితి అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుంద లేదా అని కూడా పరిశీలించి నివేదిక లను సమర్పించాలన్నారు

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల మౌలిక వసతులపై సి ఎస్ ఆరా

రంగారెడ్డి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : రెసిడెన్షియల్ విద్యాసంస్థల కనీసం మౌలిక వసతులపై సోమవారం ఆరా తీసినరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అందుతున్న మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టర్లు క్రమం తప్పకుండా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఆహార విషబాధ, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వంటశాలలను ఆధునీకరించే అవకాశం ఉన్న చోట్ల పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. విద్యాసంస్థల్లోని సౌకర్యాలు, లోపాలు, చేపట్టిన పరిష్కార చర్యల వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులను ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుంటుందని తెలిపారు.జిల్లాలలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ప్రతికూల నివేదికలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సూచించారు. ఏదైనా సమాచారం తప్పుడు ప్రచారంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇకపై ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు తీసుకోవాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పథకాల అమలులో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఫ్ఆర్ఎస్, విద్యార్థుల వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతి పాఠశాల స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి పాఠశాలకు సంబంధిత బాధ్యతలు స్పష్టంగా కేటాయించి, రోజువారీ ప్రగతిని పర్యవేక్షించాలని, ఉదయం నిర్ణీత సమయానికి పనుల పురోగతిపై నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల పాఠశాల మార్పులు, డ్రాప్‌బాక్స్‌లో పెండింగ్‌లో ఉన్న వివరాలు, టీసీలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఫీజు బకాయిలను కారణంగా చూపుతూ విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా చూడాలని, విద్యార్థుల బదిలీ విషయంలో సంబంధిత పాఠశాలలతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ఫలితాలు, రికార్డులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఆధార్ వివరాల్లో మిస్‌మ్యాచ్, ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర సాంకేతిక సమస్యలను గుర్తించి వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా పాఠశాలల పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం క్లాత్ సరఫరా, స్టిచింగ్, ఇతర పెండింగ్ అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ముందుగా క్లాత్ సరఫరా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనంతరం స్టిచింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. దసరా నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖలు, సరఫరాదారులతో సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కరించాలని, రేపటి సాయంత్రంలోగా పెండింగ్ అంశాలపై స్పష్టమైన పురోగతి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఏ పని కూడా నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. పెండింగ్ అంశాలన్నింటిపై రేపటి సాయంత్రంలోగా స్పష్టమైన పురోగతి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ పని కూడా నిర్లక్ష్యం లేదా సమన్వయ లోపం కారణంగా నిలిచిపోకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట్ నారాయణ, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావ్, బీసీ వెల్ఫేర్ అధికారి కేషు రామ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వెంకటేష్, మైనార్టీ అధికారి, సంబంధిత ఆర్‌సి లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలి


**అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించాలి**

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా లో నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం జిల్లాలో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా లో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను అదనపు కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా ఓటరు గా నమోదు కోసం గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ఫారం 18 ద్వారా అన్ని వివరాలను నింపి గెజిటెడ్ అధికారి లేదా డిసిగ్నేటెడ్ అధికారి ద్వారా సంతకం చేసిన ధ్రువపత్రాన్ని సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. 01/11/2023కంటే ముందు పట్టభద్రులైన వారు, ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో స్థానిక నివాసులై ఉన్నవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశం అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో కొత్తగా ఓటరుగా నమోదుకు సంబంధించిన ఫారం 18 ద్వారా తన గ్రాడ్యుయేట్ వివరాలతో పూర్తి చేసిన ఓటరు నమోదు పత్రాన్ని ఈ.వి.శ్రీనివాస్ రావు జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో వెంకటేష్ లకు అందించారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, వివిధ పార్టీల ప్రతినిధులు ఈ. వి. శ్రీనివాస్ రావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యామ్ సుందర్, నాగబెల్లి రజినీ కాంత్, ఎండీ నేహాల్, అంబాల ప్రశాంత్, బస్కె నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వాహనానికి తప్పిన ప్రమాదం




నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ ధరా వేణుగోపాల్ ప్రయాణిస్తున్న అధికారిక వాహనం ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్తుండగా, నార్కట్‌పల్లి వద్దగల కామినేని ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారి 65పై ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే ఎముందు వెళ్తున్న ఒక కంటైనర్ వాహనం నిర్లక్ష్యంగా టర్న్ తీసుకోవడంతో అదనపు కలెక్టర్ వాహనం వెనుకభాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అధికారిక వాహనం వెనుక భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే, వాహనంలో ఉన్న అదనపు కలెక్టర్‌తో పాటు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఎఘటనపై సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ పందిరి విష్ణు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# శ్రీ విద్యాపీఠ్‌లో అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, అంతరిక్ష విజ్ఞాన ప్రయోగశాల ప్రారంభం

ఎనార్కట్‌పల్లి, సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర ): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా నార్కెట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్ పాఠశాలలో అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ మరియు 'అంతరిక్షాలై' (రాజుఖుఎవ వాఎఅవఅఎవ ఖుఎ) ప్రయోగశాలను ప్రారంభించారు. హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయంతో పాటు 10,000కు పైగా వివిధ పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇది విద్యార్థుల్లో పఠనాసక్తిని, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించడానికి దోహదపడుతుంది. అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి, అవగాహన పెంచేందుకు అత్యాధునిక పరికరాలతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అనుభవపూర్వక విద్య ద్వారా భవిష్యత్తులో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు ఇది స్ఫూర్తినిస్తుంది.ఎఈ సందర్భంగా కామినేని డాక్టర్ పూజా మరియు పాఠశాల ప్రిన్సిపాల్ బిట్ర సుస్మిత మాట్లాడుతూ.. "నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలు కూడా ఎంతో అవసరం. విద్యార్థులు ఈ అత్యాధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను



అధిరోహించాలి" అని సూచించారు.ఎవిద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తామని కామినేని యాజమాన్యం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# రేడియేషన్ చికిత్సలో నూతన ఒరవడి పలికిన యశోద ఆసుపత్రి వైద్యులు

## రేడియేషన్ అంకాలజిస్టు వైద్యులు పెద్ది మణిదీప్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28,(విజన్ ఆంధ్ర)క్యాన్సర్ రోగుల మెరుగైన చికిత్స కోసం ఎంఆర్ లైనిక్ అనే అత్యాధునిక టెక్నాలజీని హైదరాబాద్ హైటెక్ సిటిలోని యశోద ఆసుపత్రిలో సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి ప్రవేశపెట్టడం జరిగిందని, రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది పలికామని యశోద ఆసుపత్రి రేడియేషన్ అంకాలజిస్టు వైద్యులు పెద్ది మణిదీప్ అన్నారు. సోమవారం మంచిర్యాలలో రేడియేషన్ చికిత్సలో నూతన ఒరవడి, మార్పులపై పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు.యశోద హైటెక్ సిటీ ఆసుపత్రిలో ప్రపంచంలోని అత్యాధునిక రేడియేషన్ యంత్రాలలో ఒకటైన ఎంఆర్ స్కానింగ్, లీనియర్ యాక్సిలేటర్ ఒకే యంత్రంలో పని చేయడమే దీని ప్రత్యేకత అన్నారు. దీంతో ట్యూమర్ ఆకారం సైజు, స్థానం వంటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని, దీని ఆధారంగా రేడియేషన్ కేవలం ట్యూమర్ ఉన్న ప్రాంతానికే ఇవ్వబడి మిగితా చుట్టు పక్కల ఉన్న ఆరోగ్యకరమైన అవయవాలపై తక్కువ ప్రభావం ఉండేవిధంగా చికిత్స అందించడం జరుగుతుందని వివరించారు. సాధారణ రేడియేషన్ థెరపిలో రోగులకు తలనొప్పి, స్కిన్, ఇరిటేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్ రావచ్చని కానీ నూతన టెక్నాలజీతో వీటన్నింటిని నివారించవచ్చని వివరించారు. ప్రోస్టేట్ క్యాన్సర్, రెక్టల్ క్యాన్సర్, యుటరస్, సర్విక్స్, బ్లాడర్, లంగ్, ప్యాంక్రియాస్, బ్రెయిన్ ట్యూమర్లు వంటి కష్టమైన క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. దీని ద్వారా సమయం చాలా ఆదా అవుతుందని, కొన్ని సందర్భాలలో ఐదు రోజుల్లోనే పూర్తి చికిత్స పూర్తవుతుందని దీని ద్వారా రోగులకు మానసికంగా, శారీరకంగా పెద్ద ఉపశమనం ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో హైటెక్సిటి యశోద ఆసుపత్రి అకాంలజీ మేనేజర్ పత్తిపాక శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ పాలకుర్తి నవీన్ పాల్గొన్నారు.

# 'రావణబ్రహ్మ' ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్న 'వెంకటస్వామి'





హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రఖ్యాత రంగస్థల కళాకారుడు, మేకప్ ఆర్టిస్ట్‌బాపనపల్లి వెంకటస్వామి తన అద్భుతమైన అభినయంతో వాక్చాతుర్యంతో 'రావణబ్రహ్మ' ఏకపాత్రాభినయాన్ని అమోఘంగా ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించి మంత్రముగ్ధులను చేసి ఆకట్టుకున్నాడు, అలరించాడు. ఆదివారంనాడు ఇబ్రహీంపట్నం మంచాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'రావణబ్రహ్మ' ఏకపాత్రాభినయం ప్రదర్శనతో అందరి దృష్టిని వెంకటస్వామి ఆకర్షించాడు. అనంతరం గ్రామ పెద్దలు, పోలీస్ డిపార్ట్మెంట్ పెద్దల చేతుల మీదుగా సత్కారాన్ని ప్రశంశలను అందుకున్నాడు. ఈ సందర్భంగా బాపనపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ, అశేష ప్రేక్షక దేవుళ్ళ సమక్షంలో ప్రదర్శించే భాగ్యం కలగడం ఎంతో అదృష్టంగా, ఆనందంగా భావిస్తున్నానని నిర్వాహకులకు కళాభివందనాలు తెలిపారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.

**- ఎన్నికల సంఘం పనితీరుపై వచ్చిన ఆరోపణలపై పారదర్శక విచారణ జరపాలి**
**- కలెక్టరేట్ ఏవో కు వినతిపత్రం అందజేత.**



నారాయణపేట, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : ఎన్నికల సంఘం పనితీరు,ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ (ఈ సి) జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కొన్ని జాతీయ పత్రికలలో పరిశోధనాత్మక కథనం ప్రకారం,ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు,వివేక్ జోషిలు గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల జాబితా,కొత్త ఓటర్ల నమోదు,ఓటర్ల పేర్ల తొలగింపు మరియు పునరుద్ధరణ,ఎన్నికల డేటా నిర్వహణ తదితర అంశాలపై అభ్యంతరాలను రికార్డులో నమోదు చేసినట్లు వెల్లడైందన్నారు. అదేవిధంగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్) భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని ప్రశాంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఓటర్ల జాబితా సవరణలో ప్రతి అర్హుడైన ఓటరుకు తగిన నోటీసు, తన వాదనను వినిపించే అవకాశం, పేరును సరిచేసుకునే సమర్థవంతమైన ప్రక్రియ ఉండాలని ఆయన కోరారు.ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారనే నివేదికలు వెలువడిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తి పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం అందచేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్.సలీం, అధికార ప్రతినిధి వి. సంతోష్ కుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి.గౌస్,శ్రీనివాస్ రెడ్డి, విజయ్ గౌడ్,కృషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రయోజనాల కోసమే ఈసీ వ్యవహరిస్తోంది: ఆత్రం సుగుణక్క..

**- ఓటర్ల జాబితా వ్యవహారంలో కుట్రను బట్టబయలు చేయాలి..**
**- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం.**
**- ఆసిఫాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ..**
**- మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మల దహనం.**






ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28: (విజన్ ఆంధ్ర) : ఆసిఫాబాద్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసేందుకు కుట్ర చేస్తోందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితా విషయంలో పారదర్శకత లేకుండా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖ అనిల్ కుమార్,మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, అక్కడి నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటాబేస్ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ వంటి కీలక అంశాల్లో ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల కమిషన్‌లోనే అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్లడం వెనుక కారణాలేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. కానీ బీజేపీకి రాజకీయంగా లాభం చేకూరే విధంగా ఓటర్ల జాబితాలో మార్పులు జరుగుతున్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇది సాధారణ విషయం కాదు.. ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేసే అంశం. బీజేపీ కుట్రలను, ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు ప్రశ్నిస్తూనే ఉంటుందని అన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని సుగుణక్క స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి,టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుర్గం భాస్కర్,వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ లు ఇరుకుల మంగ, కుడిమెత విశ్వనాథ్ రావు,సుద్దాల దేవయ్య, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా,డీఎంసి వైస్ చైర్మన్ మంథయ్య,మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్,జిల్లా ఎస్సి సెల్ చైర్మన్ సుద్దాల శ్రీనివాస్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ అర్షద్ హుస్సేన్,మండల అధ్యక్షులు రాపర్తి మురళి,ఇమ్రాన్,రాసిద్,కిషన్ గౌడు,మెంగజీ,ఆత్రం శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ మండలాల అధ్యక్షులు, ఱజజ జిల్లా కార్యవర్గాల సభ్యులు,మండల-పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షాద్‌నగర్ లో కలకలం - రాయికల్ టోల్‌గేట్ వద్ద జింక మాంసం పట్టివేత.. నిందితులు అదుపులో?



తెలంగాణ స్టేట్ బ్యూరో, షాద్‌నగర్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద జింక మాంసం పట్టివేత కలకలం రేపింది. జింకలను వేటాడి మాంసాన్ని తరలిస్తున్న ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అటవీశాఖకు అందిన పక్కా సమాచారం మేరకు అధికారులు రాయికల్ టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తుండగా జింక మాంసాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జింకలను వేటాడి మాంసం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీశాఖ అప్రమత్తమై ఈ దాడి చేసినట్లు సమాచారం. అయితే ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులకు గానీ, ఇతర అధికారులకు గానీ పూర్తి సమాచారం అందలేదు. ఘటనపై వివరణ కోసం సంబంధిత అటవీశాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు ఎవరు? జింక మాంసం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి కోసం రవాణా చేస్తున్నారు? ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడైన తర్వాతే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# జ్ఞానేశ్ కుమార్ ను విధుల నుంచి తొలగించాలి

**- డీసీసీ ప్రెసిడెంట్ జాదవ్ ధారసింగ్ నాయక్**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : ఓటు చోరీకి పాల్పడుతున్న ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే రాజీనామా చేయించాలని డీసీసీ ప్రెసిడెంట్ జాదవ్ ధారసింగ్ నాయక్ మండిపడ్డారు. సోమవారం ఏఐసీసీ ,పీసీసీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టగా అందులో భాగంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు డీసీసీ ప్రెసిడెంట్ జాదవ్ ధారసింగ్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన,ధర్నా కార్యక్రమం చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి విన్నతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గతంలో రాహుల్ గాంధీ బీహార్, పశ్చిమబెంగాల్ తో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఓటు చోరీ గురించి తిరిగి చెప్పడం జరిగిందని,బీహార్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఓటు చోరీ పై నిరసన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు.బీజేపీ తొత్తులు రాహుల్ గాంధీని హేళన చేసి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని,నేడు వాస్తవ పరిస్థితులను ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఎలక్షన్ కమిషన్ ముగ్గురు సభ్యుల్లో జ్ఞానేశ్ కుమార్ బీజేపీ కి తొత్తుగా పని చేస్తారని తెలిపారు.జ్ఞానేశ్ కుమార్ తో పాటు పని చేసే ఇద్దరు ఎలక్షన్ చీఫ్ కమిషనర్ సభ్యులు తప్పులు జరుగుతున్నాయని ముందే హెచ్చరించారని,14 సార్లు తప్పులను ఎత్తి చూపిన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ పట్టించుకోలేదని సమాచారం వచ్చిందని అన్నారు.ఓటు చోరీ విషయంలో ముందే రాహుల్ గాంధీ ప్రజలు చెప్పిన పట్టించుకోలేదని,ఇప్పుడు కళ్లారా ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాలలో వీరు ఓటు చోరీ చేసి వచ్చారని,వారి ఇష్టానుసారం ఓట్ల విషయంలో రాజ్యాంగాన్ని మారుస్తున్నారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ లో చిన్న తప్పులు ఉన్న నోటీసులు ఇవ్వడం జరిగిందని మండిపడ్డారు. అమాయకులైన,బీసీ,ఎస్టీ,ఎస్సి ప్రజలకే ఎక్కువ నోటీసులు వచ్చాయని,13 ఆధారాలతో ఏవో 3 ఆధారాలు ఇవ్వాలని చెప్పగా, అవి కూడా లేని ఎంతో మంది ఉన్నారన్నారు.ఆధార్ ను ప్రామాణికం చేయడం లేదని అన్నారు.ఎన్నికల అధికారులు సక్రమంగా పని చేయకపోతే ప్రజలు తిరగబడే రోజు వస్తుందని,ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ విధుల నుంచి వెంటనే తొలగిపోవాలనిహెచ్చరించారు.అనంతరం దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు సంతోష రాజు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిళ్లపాటి రాజశేఖర్ రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు అర్ధ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

# షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా ఘన నివాళి..



ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ 119వ జయంతిని ఛత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దేశ యువతలో స్వేచ్ఛాకాంక్షని రగిల్చిన విప్లవ జ్యోతి, యువతకి స్ఫూర్తి ప్రధాత, గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా చరిత్రలో నిలిచారని క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.కోటేష్, ఎస్.కరణ్, దుర్గా ప్రసాద్, రాఘవేంద్ర, ఆంజనేయులు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

**:సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి ...**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28: (విజన్ ఆంధ్ర) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలల రక్షక భవనంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి మాట్లాడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మహిళా ఉద్యోగులకు వేధింపులు జరుగుతున్నాయని, ముఖ్యంగా బాల రక్షక భవన్ కార్యాలయం నందు “మహిళా ఉద్యోగులకు వేధింపులకు మహిళా ఉద్యోగులు కార్యాలయాల్లో భయాందోళనలకు గురికాకుండా సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా చూడటం ప్రభుత్వ అధికారుల బాధ్యత. అయితే పత్రికలో వచ్చిన ఆరోపణలు నిజమైతే, ఇది అత్యంత తీవ్రమైన విషయం. ఇలాంటి ఘటనలను నిర్లక్ష్యం చేయడం వల్ల బాధిత మహిళా ఉద్యోగులకు న్యాయం జరగకపోవడంతో పాటు, ఇతర ఉద్యోగుల్లో కూడా భయాందోళనలు నెలకొనే అవకాశం ఉంది.కావున పత్రికలో ప్రచురితమైన వార్తను సుమోటోగా పరిగణనలోకి తీసుకొని, సంబంధిత శాఖలు/కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులపై వేధింపులకు సంబంధించిన అంశాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని, బాధిత మహిళా ఉద్యోగుల నుంచి గోప్యంగా వివరాలు సేకరించి, విచారణలో ఆరోపణలు నిజమని తేలిత సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, 2013 (ూూాం ూాఖ్) నిబంధనలు సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అంతర్గత ఫిర్యాదుల కమిటీల (×జజ) పనితీరును పరిశీలించాలని మనవి చేస్తున్నామని, భారత కమ్యూనిస్టు పార్టీ, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సమితిగా కోరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఆప్కారి సీఐకి సన్మానం



కామారెడ్డి బ్యూరో (దోమకొండ)సెప్టెంబర్ 28 (విజన్ఆంధ్ర) :కామారెడ్డి జిల్లా దోమకొండ ఆప్కారి సిఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించి న సిఐ సర్వేశ్వరరావు, ఎస్సై దీపికను సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఐరేణి నరసయ్య, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్,వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, కూర సంతోష్,చింతల స్వామి శాలువాతో సన్మానించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల.**
**- ప్రజావాణికి 130 పిర్యాదుల స్వీకరణ.**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డి.ఆర్.ఓ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 130 వినతులను అధికారులు స్వీకరించారు.

***జిల్లా అధికారుల సమావేశం***

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు పోష న్ మా లో బాగంగా “మన అంగన్‌వాడీ మన బాధ్యత” అనే థీమ్‌తో చేపడుతున్న పోషణ కార్యక్రమం లో భాగంగా పిల్లలకు, గర్భిణీలకు పోషకాహారం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం తో పాటు వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే కార్యక్రమాలకు మహిళా, శిశు సంక్షేమ శాఖకు విద్య, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తో పాటి సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అలాగే, ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్ల కోసం పాటల పోటీలు, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ సహకారంతో పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించి, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యల పట్ల గౌరవం, కుటుంబ, మానవతా విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా సమన్వయం చేసుకోవాలని డి. ఆర్.ఓ ఎ. నిర్మల సూచించారు. కమానవేశంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి.ఈ.ఓ ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణజింకను వేటాడి మాంసంతో పట్టుబడ్డ తొమ్మిది మంది

**- షాద్‌నగర్‌లో పోలీస్, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్**
**- మీడియా సమావేశంలో షాద్‌నగర్ డిసిపి శిరీష రాఘువేందర్ వెల్లడి**

షాద్ నగర్,సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర ):కృష్ణజింకను వేటాడి, దాని మాంసాన్ని ముక్కలుగా నరికి నగరానికి తరలిస్తున్న తొమ్మిది మంది ముఠాను షాద్‌నగర్ పోలీసులు, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి లైసెన్స్‌డ్ తుపాకీ, బుల్లెట్లు, కృష్ణజింక మాంసం, రెండు వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ శిరీష రాఘవేంద్ర వివరాలు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 26న అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు కార్లలో నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. సెప్టెంబర్ 27న ఉదయం లైసెన్స్‌డ్ తుపాకీతో కృష్ణజింకను వేటాడి చంపిన అనంతరం దాని మాంసాన్ని ముక్కలుగా నరికి ప్యాక్ చేసుకుని హైదరాబాద్ వైపు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా నిందితుల ముఠా పట్టుబడింది. విచారణలో కృష్ణజింకను తామే వేటాడినట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎం.డి. హాజీ ఉద్దీన్ (36), మీర్ ముక్తార్ అలీ (37), ఎం.డి. తాజుముల్ (37), మీర్ రాజా అలీ ఖాన్ (39), ఖుర్రం ఖాన్ (35), సయ్యద్ సల్మాన్ అలీ (30), ఎం.డి. అఫ్రోజ్ ఖాన్ (36), ఎం.డి. అబ్దుల్ అజీజ్ (33), ఎం.డి. రియాజ్ (28) ఉన్నారు. నిందితుల నుంచి .315 రైఫిల్, టెలిస్కోప్, సైలెన్సర్, 19 బుల్లెట్లు, సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, నల్లటి స్కార్పియో వాహనం, సుజుకి ఎస్-క్రాస్ వాహనం, ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు, రూ.28,590 నగదు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని 9, 39, 50, 51, 57 సెక్షన్లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వన్య ప్రాణులను వేటాడటం, చంపడం, వాటి మాంసాన్ని అక్రమంగా తరలించడం లేదా విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్యప్రాణుల అక్రమ వేటకు సంబంధించిన సమాచారం తెలిస్తే అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1800-425-5364, 040-23231440కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మీడియా సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, ఎస్‌వోటీ పోలీసులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు..






# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాల పునఃసిద్ధత



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్, వరంగల్‌ఖమ్మంనల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటరు జాబితాలను కొత్తగా సిద్ధం చేయనున్నట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా నిర్ణయించి ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. సెప్టెంబర్ 28న ప్రజా నోటీసు జారీ చేయనుండగా, అక్టోబర్ 15, 25 తేదీల్లో పత్రికల్లో నోటీసుల పునఃప్రచురణ చేపట్టనున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు ఫారం-18లో దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురించి, డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. డిసెంబర్ 25లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది ఓటరు జాబితాలను ప్రచురించనున్నట్లు అధికారులు తెలిపారు. 2027 మార్చిలో ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో సాధారణ ఖాళీలు ఏర్పడనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ పునఃసిద్ధత ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించింది.

| Sl. No. | Activity | Period/Date |
|---|---|---|
| 1 | Issue of public notice under Rule 31(3) of the Registration of Electors Rules, 1960 | 28.09.2026 (Monday) |
| 2 | First re-publication of notice in Newspapers under Rule 31(4) of the Registration of Electors Rules, 1960 | 15.10.2026 (Thursday) |
| 3 | Second re-publication of notice in Newspapers under Rule 31(4) of the Registration of Electors Rules, 1960 | 25.10.2026 (Sunday) |
| 4 | Last date of receipt of applications in Form 18 | 06.11.2026 (Friday) |
| 5 | Date by which preparation of manuscripts and printing of draft Electoral Rolls be done | 20.11.2026 (Friday) |
| 6 | Draft Publication of Electoral Rolls | 25.11.2026 (Wednesday) |
| 7 | Period for filing of claims and objections under Rule 12 of the RER, 1960 | 25.11.2026 (Wednesday) to 10.12.2026 (Thursday) |
| 8 | Date by which claims and objections shall be disposed of and supplements prepared and printed | 25.12.2026 (Friday) |
| 9 | Final Publication of Electoral Rolls | 30.12.2026 (Wednesday) |

# క్షేత్రస్థాయిలో పత్తి, కంది, వరి, బెండ, టమాట పంటల పరిశీలన

**- చీడపీడలు, తెగుళ్ల నియంత్రణపై రైతులకు సాంకేతిక సూచనలు**

**- తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. పి. అర్చన**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ, వడ్డేపల్లి, మల్దకల్ మండలాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. పి. అర్చన ఆధ్వర్యంలో పంటల క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పి. అర్చన అయిజ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఎంఏఓ.జనార్ధన్, ఏఈఓ.నవీన్‌లతో కలిసి పత్తి, కంది పంటలను పరిశీలించి 20 మంది రైతులతో మాట్లాడారు. పత్తి, కంది పంటలను పరిశీలించగా, తక్కువ వర్షపాతం, బోరుబావులు ఎండిపోవడం వల్ల పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లోనే రబీ పంటలు సాగు చేయాలని, ఫామ్ పాండ్లు, పెర్కొలేషన్ ట్యాంకుల ద్వారా వర్షపు నీటిని సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండలం జూలకల్ ఫామ్‌లో సాగు చేసిన కంది పంటను పరిశీలించగా, పంట ఆశాజనకంగా ఉన్నట్లు తెలిపారు. మల్దకల్ మండలంలో ఎంఏఓ. రాజశేఖర్, క్లస్టర్ ఏఈఓ.రాహుల్ పైలట్‌లతో కలిసి పత్తి, వరి, బెండ, టమాట పంటలను పరిశీలించారు. పింక్ బోల్‌వార్మ్ నివారణకు ఫెరోమోన్ ట్రాపులను వినియోగించాలని, పురుగు ఉధృతిని బట్టి సిఫార్సు చేసిన పురుగుమందులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. వరి పంటలో ఆకులు, కాండం ఎర్రబడటానికి గల కారణాలను ముందుగా నిర్ధారించిన తర్వాతే తగిన నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. బెండ, టమాట పంటల్లో చీడపీడలు, వాడిపోయే తెగుళ్లను తొలిదశలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, పంటలకు అధిక నీటిపారుదల లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తూ, సిఫార్సు చేసిన మోతాదుల్లోనే పురుగుమందులు వినియోగించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవాలని డా. పి. అర్చన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారవేత్త గట్టు మహేష్ బాబు సేవలు అభినందనీయం...

**- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి...**




హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : ప్రముఖ వ్యాపారవేత్త గట్టు మహేష్ బాబు సేవలు అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో శాంతి కృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కాకతీయ కళావైభవం, అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టు మహేష్ బాబు చేసిన సేవలకు గాను కాకతీయ కళ సేవా బాంధవుడు అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గట్టు మహేష్ బాబు మాట్లాడుతూ ఇంతటి మహోన్నతమైన అవార్డును నాకు అందజేసిన పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి మరియు శాంతి కృష్ణ సేవా సమితి నిర్వాహకులు ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, విశ్వ కళావిరాట్ డాక్టర్. శాంతి కృష్ణ ఆచార్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాననీ గట్టు మహేష్ బాబుఅన్నారు.

## పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పత్రుడు



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) కార్యాలయంలో సోమవారం పారా లీగల్ వాలంటీర్ల (పిఎల్వీ లు)తో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పత్రుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, పారా లీగల్ వాలంటీర్లు న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, న్యాయ సహాయం అవసరమైన ఇతర వర్గాలకు ఉచిత న్యాయ సేవలు, న్యాయ సహాయం, న్యాయ అవగాహన అందుబాటులో ఉన్న విషయాన్ని తెలియజేయాలని సూచించారు. పారా లీగల్ వాలంటీర్లు తమ పరిధిలో ప్రజల సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే న్యాయ సేవలకు అనుసంధానం చేయాలని తెలిపారు. అలాగే లోక్ అదాలత్‌లు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళలు , బాలల హక్కులు, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అదేవిధంగా, పారా లీగల్ వాలంటీర్లు తమకు అప్పగించిన విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, ప్రజలకు న్యాయ సేవలు సకాలంలో అందేలా కృషి చేయాలని కార్యదర్శి ఆదేశించారు. సమావేశం అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున పారా లీగల్ వాలంటీర్లకు ఐడీ కార్డులను కార్యదర్శి జి. నిష్కా పత్రుడు అందజేశారు. ఈ ఐడీ కార్డులను విధి నిర్వహణ సమయంలో తప్పనిసరిగా ధరించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ న్యాయ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మరియు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## విస్తృతంగా ఈవీ ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు లక్ష్యంగా ముందుకు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : ఎలక్ట్రానిక్ వెహికల్స్(ఈవీ)లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఏథర్ సంస్థ ప్రతినిధులు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా గత జూన్ 30 నాటికి 218 ఏథర్ ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ స్కూటర్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఛార్జింగ్ సౌకర్యాలు దైనందిన జీవితంలో భాగం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటి వద్ద రాత్రిపూట ఛార్జింగ్, సుదూర ప్రయాణాలకు ఏథర్ గ్రిడ్ ఫాస్ట్ ఛార్జింగ్ నెట్‌వర్క్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా ఏథర్ గ్రిడ్ లో 6 వేలకు పైగా ఫాస్ట్ ఛార్జర్లు, ఓపెన్-సోర్స్ ఎల్ఈసీసీఎస్ ఛార్జర్లతో సహా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫాస్ట్ ఛార్జర్ 10 నిమిషాల్లో సుమారు 30 కి.మీ. ప్రయాణానికి సరిపడే శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. కేఫ్‌లు, కార్యాలయాలు, మాల్స్ వంటి ప్రజలు సందర్శించే ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు, షేర్డ్ ఛార్జింగ్ ప్రమాణాలు, అపార్ట్‌మెంట్లలో సులభమైన ఛార్జర్ ఇన్‌స్టాలేషన్ ద్వారా ఈవీ యాజమాన్యాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

# ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

**- ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి**

**- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.కాజీపేట మండలం మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం మతస్తులకు స్మశాన వాటికల కేటాయింపునకు ప్రతిపాదించిన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, భూమి విస్తీర్ణం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కేటాయింపునకు సంబంధించి అవసరమైన స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన పూర్తి చేసి, అవసరమైన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజును జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను రికార్డులతో క్షేత్రస్థాయిలో సరిపోల్చి పరిశీలించాలని, ప్రభుత్వ భూములపై అనధికార ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు.ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించే సందర్భంలో భూమి స్థితిగతులు, రికార్డులు, స్థల అనుకూలత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను వీడుదాం.. ఆరోగ్యకరమైన జీవితాలతో ఎదుగుదాం

**- విద్యార్థుల్లో డ్రగ్స్‌పై అవగాహన పెంచాలి**

**- మత్తు పదార్థాల సమాచారం అధికారులకు తెలియజేయాలి**

**- డీఈఓ డి. వాసంతి**



*సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతాం*

కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 29(విజన్ ఆంధ్ర) : మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాలతో ఎదగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలం బాబు క్యాంప్ పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. నీరజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఈఓ డి. వాసంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ప్రారంభించిన నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడం, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్స, పునరావాసం అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల పరిసరాల్లో లేదా తాము నివసించే ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే, ఆ సమాచారాన్ని తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ఉపాధ్యాయుల ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేయాలని డీఈఓ విద్యార్థులకు సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు అందించే సమాచారాన్ని అధికారులు అత్యంత గోప్యంగా ఉంచుతారని తెలిపారు.అదేవిధంగా ఎవరైనా అపరిచితులు లేదా ఇతరులు ఆహార పదార్థాలు ఇచ్చినప్పుడు వాటిని స్వీకరించి తినకూడదని విద్యార్థులకు సూచించారు. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. నీరజతో పాటు ఉపాధ్యాయులు రమాదేవి, సౌందర్య, షేక్ దస్తగిరి, స్టెల్లా జ్ఞానవతి, సరోజిని, దేవేందర్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీనామా చేయాలి

**- డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖ రెడ్డి**







సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :28(విజన్ ఆంధ్ర ) : కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా సోమవారం నాడు సంగారెడ్డిలో పాత బస్టాండు అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేపట్టారు . డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను వివిధ మార్గాల్లో భయపెట్టి అధికారంలో కొనసాగాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర విమర్శలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పారదర్శకత, వివరణ కోరుతూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నామన్నారు. మాజీ డి సి సి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఓట్ల చోరీ అంశాన్ని రాహుల్ గాంధీ గత రెండేళ్లుగా చెపుతున్నారని అన్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపిస్తూ వస్తుందన్నారు తనకు కూడా 14 రకాల పత్రాలు సమర్పించిన పుటికీ నోటీసు వచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కు సంబంధించి అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ నారాయణఖేడ్ నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లకు సంబంధించి సుమారు 40 వేల మందికి నోటీసులు వచ్చాయని తెలిపారు. దళితులు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తోందన్నారు. ఇదే విధానాన్ని దక్షిణ భారతదేశంలోనూ కొనసాగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. . ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును పరిరక్షించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ లోని అడిషనల్ కలెక్టర్ సంగీత కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీల మధు, కాంగ్రెస్ మహిళా నాయకురాలు కాటా సుధారాణి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి తూపాజి అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రాత్రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్,సదాశివపేట మున్సిపల్ చైర్పర్సన్ అంజమ్మ, కిరణ్ గౌడ్, కూన సంతోష్, గంగేరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు

# పేటలో విజయవంతంగా ముగిసిన గణేష్ ఉత్సవాలు

**- సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెల్పిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**




నారాయణ పేట, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం.. పోలీసుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, తాఖీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసినందున జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పీస్ కమిటీ మత పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం విడుదల ఎస్పీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలతో, అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, యువత, జిల్లా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గణేష్ శోభాయాత్ర నిమజ్జనం, తాఖీ బాబా దర్గా ఉర్సు నిర్వాహకులు, భక్తులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియో రికార్డింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ భద్రత వంటి చర్యలతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ప్రజల ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం నారాయణపేట జిల్లా శాంతి సామరస్యాలకు ప్రతీకగా నిలిచాయని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలందరికీ ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వయోవృద్ధులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- వయోవృద్ధులకు సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన**

**- జిల్లా సంక్షేమ అధికారి సునంద**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వయోవృద్ధులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి సునంద అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధుల సంక్షేమం,సాధికారత వారోత్సవాల్లో భాగంగా సైబర్ భద్రత,డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ , ఏటీఎం /డెబిట్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు,వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించరాదని తెలిపారు. వయోవృద్ధులపై జరిగే వివిధ రకాల వేధింపులను గుర్తించి,అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వయోవృద్ధులకు డిజిటల్ అక్షరాస్యత,సురక్షిత బ్యాంకింగ్ విధానాలు,సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోలీస్ శాఖ సైబర్ బ్రాంచ్ ప్రతినిధి రమేష్ చారి మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల తీరును వివరిస్తూ,వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వయోవృద్ధులకు వివరించారు. వయోవృద్ధులు డిజిటల్ సేవలను సురక్షితంగా వినియోగించడంతో పాటు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కార్యక్రమంలో సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ అయ్యప్ప రెడ్డి,రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మహిళా,శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సిబ్బంది,ప్రణామ్ డే కేర్ సెంటర్ నిర్వాహకులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి


**- డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్**

**- ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ భారీ ధర్నా, నిరసన**



ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర): భారత ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు నిరసనగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నాయకత్వంలో స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ వద్ద మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. "జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి", "ఓట్ చోర్ గద్దీ ఛోడ్" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఈసీ దిష్టిబొమ్మ దహనానికి కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. ఇటీవల ఒక పరిశోధనాత్మక కథనం ప్రకారం ఎన్నికల కమిషనర్లు పలు సందర్భాల్లో ఈసీ నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు నివేదికలు వెలువడ్డాయని తెలిపారు. 30 రాష్ట్రాల్లోని ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించడమ వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర ఉందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని, స్వతంత్రతను కాపాడేందుకు ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాబూరావు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ ఇన్చార్జ్ ఆడే గజేందర్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బారెగూడ సమస్యల పరిష్కారమే లక్ష్యం సబ్ కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్ వేణుగోపాల్



కాగజ్‌నగర్ సెప్టెంబర్ 27(విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ నూతన సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరిని బారెగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ కోట వేణుగోపాల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు, అభివృద్ధి పనులపై ఆయనకు వివరించారు. ప్రజలకు అవసరమైన పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు అధికారుల సహకారం అందించాలని వినతిపత్రం సమర్పించారు. బారెగూడ గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ వేణుగోపాల్ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అధికారుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. బారెగూడలో పెండింగ్‌లో ఉన్న పనులపై కూడా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నాగోషే హన్మంతు పాల్గొన్నారు.

## చిన్న కోతల ద్వారా శస్త్రచికిత్సలు

**- యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి**




సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :28(విజన్ ఆంధ్ర ): ఛాతీకి సంబంధించిన వివిధ వ్యాధులకు యశోద హాస్పిటల్స్ అధునాతన వైద్య సేవలను అందిస్తోంది అని యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు . సోమవారం నాడు రెడ్హిల్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలోని కణితులు తదితర సమస్యలకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు ఆయన తెలిపారు. వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ, రోబోటిక్ అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ వంటి ఆధునిక పద్ధతులతో చిన్న కోతల ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల రోగులకు నొప్పి, రక్తస్రావం తక్కువగా ఉండటంతో పాటు ఆసుపత్రిలో ఉండే సమయం కూడా తగ్గుతుందని తెలిపారు. రోగులు త్వరగా కోలుకుని సాధారణ కార్యకలాపాలకు తిరిగి వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. గత పదేళ్లలో థొరాసిక్ సర్జరీ రంగంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఆధునిక సాంకేతికత, ముందస్తు వ్యాధి నిర్ధారణ, వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో సంక్లిష్టమైన ఛాతీ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. అధునాతన ఆపరేషన్ థియేటర్లు, హైడెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, ఆధునిక సర్జికల్ ప్లాట్ఫారంలతో పాటు థొరాసిక్ సర్జన్లు, పల్మనాలజిస్టులు, అంకాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లినరీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించిన ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక వ్యాధుల నుంచి ఛాతీలోని కణితులు, సంక్లిష్టమైన థొరాసిక్ అత్యవసర పరిస్థితుల వరకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైతే అందుకు సంబంధించిన అధునాతన సేవలను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.

## ప్రతి అర్జీ పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**- హాస్టల్స్ లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు అందజేయాలి**
**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**- జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్**
**- హనుమకొండ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 309 అర్జీలు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారం పై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల హాస్టల్స్, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల స్పెషల్ అధికారులు సత్వరమే అందజేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులైన ఓటర్లు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 136 అర్జీలను ప్రజలు అందజేయగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 38 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 135 అర్జీలు ( మొత్తం 309 ) వచ్చాయి.ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 28, ( విజన్ ఆంధ్ర) : ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలనుస్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు, మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలి

**- విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి**
**- విద్యార్థులు భగత్ సింగ్ వారసులుగా ఎదగాలి**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
**- హనుమకొండలో వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన**

హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ): శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పబ్లిక్ గార్డెన్ నుండి ప్రారంభమైన విద్యార్థి ప్రదర్శన కేయూ క్రాస్ రోడ్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు కొనసాగింది. అనంతరం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 90 ఏండ్ల చరిత్ర ఏ విద్యార్థి సంఘానికి లేదని, స్వాతంత్ర్య ఉద్యమంలో పురుడు పోసుకుని దేశ స్వాతంత్ర్యం, దేశ భద్రత, శాస్త్రీయ విద్య లక్ష్యాలుగా చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు అన్న నినాదం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం జరిగిందని తెలిపారు.కమ్యూనిస్టు భావజాలాన్ని పునికిపుచ్చుకున్న కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్ వారసత్వంతో ఏఐఎస్ఎఫ్ పుట్టిందని, దేశంలో ప్రథమ విద్యార్థి సంఘం అయిన ఏఐఎస్ఎఫ్ లో నెహ్రూ, అటల్ జీ లాంటి వారు పని చేశారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఏఐఎస్ఎఫ్ శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుతున్నదని, ఏఐఎస్ఎఫ్ లో పని చేసిన వారు ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. నేడు విద్యా రంగం పలు సమస్యలను ఎదుర్కొంటున్నదని, విద్యార్థి లోకాన్ని నిర్వీర్యం చేసేలా పాలకుల విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా రంగంలో



కాషాయీకరణ చొప్పిస్తూ విద్యార్థులలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థుల నుండి రేపటి నవతరం నాయకులు తయారు కావాలని, అందుకు విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. వరంగల్ లోని ఆర్ఈసి నుండి ఒకప్పుడు ఎంతో మంది నాయకులు తయారై సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు కావాలని, భగత్ సింగ్ వారసులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ, వివేకానందుడి బోధనలను ఆయన ఉటంకిస్తూ సమాజాన్ని బాగు చేసే ముందు యుగం దూతలుగా విద్యార్థులు ఎదగాలని అన్నారు.

**పాలకుల విధానాలను మార్చే శక్తి విద్యార్థులదే**

**ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్**

భారత రాజకీయాల్లో పాలకుల విధానాలను మార్చే శక్తి విద్యార్థులదేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ భగత్ సింగ్ వారసులైన విద్యార్థుల శక్తి జెన్ జీ ఉద్యమంగా మారిందని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ పాలన కొనసాగిస్తూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. చివరకు ఎన్నికల కమిషన్ ను ప్రయోగించి విద్యార్థి, యువ జనుల ఓటు హక్కును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను ఆ పదవి నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఇందుకోసం రియల్ హీరోలైన భగత్ సింగ్, బీఆర్ అంబేద్కర్, బిర్సాముండా లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**హనుమకొండలో వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన**

ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల మొదటి రోజు సోమవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుండి కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. వివిధ విద్యా సంస్థల నుండి విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ప్రదర్శన విద్యార్థుల నినాదాలతో హోరెత్తింది. అనంతరం కేయూ ఆడిటోరియంలో జరిగిన సభలో ప్రజానాట్యమండలి కళాకారులు విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ పాటలు పాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మణ్,రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటిషర్ల గుండెల్లో వణుకు పుట్టించిన విప్లవ శిఖరం భగత్ సింగ్

**- భగత్ సింగ్ స్ఫూర్తితో యువజన రంగ సమస్యలపై ఉద్యమించాలి**
**- ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి శ్రీమాన్**
**- ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు**

హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28,( విజన్ ఆంధ్ర ): భారత విప్లవోద్యమాలకు స్ఫూర్తి ప్రదాత, భారత స్వాతంత్ర్యోద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుడు, నునుగుమిసాలతో ఉరికోయను ముద్దాడిన వీర కిషోరం, బ్రిటిషర్ల గుండెల్లో దడ పుట్టించిన విప్లవ ధృవతార భగత్ సింగ్ అని, ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తితో నేటి విద్య, ఉపాధి, యువజన రంగ సమస్యలపై, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై యువత ఉద్యమించాలని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి శ్రీమాన్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మర్రి శ్రీమాన్ మాట్లాడుతూ సువిశాల భారతదేశంలో 1907 సెప్టెంబర్ 28న పంజాబ్ రాష్ట్రం రాయల్‌పూర్ జిల్లా బంగా ప్రాంతంలో భగత్‌సింగ్ జన్మించారని తెలిపారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఈ యువకిశోరం ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో స్వాతంత్ర్య పోరాటానికే వన్నెతెచ్చారు. తన 13వ




ఏటనే దేశ స్వాతంత్ర్యోద్యమానికి ప్రభావితుడయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బ్రిటీష్‌వారు దిగుమతి చేసిన దుస్తులను తగలబెట్టి స్వాతంత్ర్యోద్యమంలోనే యువ విప్లవోద్యమానికి తెరలేపారని, 1929లో రాజ్‌గురు, సుఖదేశ్ లతో కలిసి బ్రిటీష్ అసెంబ్లీలో పొగబాంబు విసిరిన సంఘటనతో బ్రిటీష్ పాలకులనే గడగడలాడించారని, ఈ ఘటనలో తనకు ఉరి ఖాయమని తెలిసినా ఎక్కడా అధైర్యపడకుండా నిత్యం జైల్లో సైతం అనేక గ్రంథాలను అధ్యయనం చేశారు. అనేక వ్యాసాలను తన డైరీల్లో పొందిపర్చారు. లాహోర్ జైలులో 114రోజులు దీక్ష చేసి ఖైదీల డిమాండ్లను పరిష్కరించి రాజకీయ ఖైదీగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రపంచానికి సోషలిజమే మార్గమనే సిద్ధాంతాన్ని చెప్పిన మహోన్నత వ్యక్తులైన మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ సిద్ధాంతాన్ని వంటబట్టించుకున్నారు. ఆ ముద్రే తన తుదకంటూ ఉండాలనే కృతనిశ్చయంతో “మార్క్సిస్టు“గా ప్రకటించుకున్నారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా నిలిచిన భగత్‌సింగ్ “నేను ఎందుకు నాస్తికుడినయ్యాను!“ అనే దానిపై ఒక స్పష్టమైన వైఖరిని ప్రదర్శించారు. 23 ఏళ్ల వయస్సుకే 1931 మార్చి 23న దేశం కోసం ఉరికొయ్యలు, చెరసాలలు లెక్కచేయకుండా దేశం కోసం ఉరికంబమెక్కి ప్రాణాలర్పించి చరిత్రలో నిలిచిపోయి దేశానికే ఆదర్శప్రాయుడయ్యాడు. ఆయన మరణం వృథా కాలేదని, అనంతరం ఎందరో యువకిశోరాలు స్వాతంత్ర్య పోరాటంలోకి వచ్చి ఉద్యమించారని అన్నారు. అంతటి పోరాట చరిత్ర కలిగిన మహోన్నత వ్యక్తి భగత్ సింగ్ అని, అసమానతలు లేని సమాజం కోసం పోరాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని, ఆ ఉద్యమ కారుని పోరాట స్ఫూర్తితో నేటి కాలంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్ష వంటి సమస్యలపై యువత పోరాడేందుకు భగత్ ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. భగత్‌సింగ్ పేరును కేవలం నినాదాల్లో కాకుండా ఆయన జీవితాన్ని, రచనలను, ఆలోచనలను చదవడం ద్వారా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత భగత్ జీవితం, త్యాగాలు, సిద్ధాంతాలను అధ్యయనం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, యువజన వ్యతిరేక విధానాలపై, దేశంలో ఉన్న అసమానతలపై, అకలి లేని, పేదరికం లేని, అత్యాచారాలు లేని సమాజం కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, నాయకులు జెట్టి కృష్ణ, అల్లం శివ, ఓరుగంటి విజయ్, మురళి, కనకం కావ్యశ్రీ, సాంబరాజు శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై దాడిని సహించం..


**- కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై సమగ్ర విచారణ జరపాలి.**
**- జ్ఞానేశ్వర్ కుమార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే నాయిని..**
**- హనుమకొండ డీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ,ఎంపీ..**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు, తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.హనుమకొండ హార్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య , పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు , డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,టీపీసీసీ ప్రధానకార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్,దుద్దిళ్ల శ్రీను బాబు,ఈవి శ్రీనివాస్ రావు,టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రజల అత్యంత కీలకమైన ఆయుధమని, ఆ ఓటు హక్కును హరించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై



తక్షణమే స్వతంత్ర, సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సంఘం పనితీరుపై వస్తున్న ఆరోపణలు మరింత తీవ్రమైన చర్చకు దారితీశాయని ఆయన పేర్కొన్నారు. ా×= ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు కూడా కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న మీడియా కథనాలను కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.జ్ఞానేశ్వర్ కుమార్ పై చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ఓటు చోరీ అంశాన్ని ప్రతి ప్రజాస్వామ్యవాది తీవ్రంగా పరిగణించాలని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలంటే ఓటర్ల జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశ పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇటీవల కూడా ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేస్తూ ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.ప్రజల ఓటు హక్కును ఎవరూ కాలరాయలేరు. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు జరిగాయన్న ఆరోపణలు నిజమైతే అవి ప్రజాస్వామ్యంపై దాడి వంటివే. అందుకే విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి అని ఎమ్మెల్యే నాయిని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ 125 ఏళ్లకు పైగా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైల్వేలు, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్ వంటి దేశ ప్రజలకు ఉపయోగపడే సంస్థలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్ర ఉందని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్తోందని ఆయన ఆరోపించారు. బిఎస్ఎన్ఎల్ వంటి సంస్థల సామర్థ్యాన్ని దెబ్బతీసి ప్రైవేట్ టెలికాం సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైల్వేలు, ఎల్ఐసి తదితర రంగాల విషయంలోనూ ప్రైవేటీకరణపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థపై భారీ అప్పుల భారం మోపిందని కూడా ఆయన ఆరోపించారు. యువత భవిష్యత్తుతో ముడిపడిన పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలపై కూడా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ అభివృద్ధి విషయంలో కూడా బీజేపీ నేతలు కేవలం ప్రెస్‌మీట్లకు పరిమితమవుతున్నారని నాయిని విమర్శించారు. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎవరి పాత్ర ఎంత ఉందో ప్రజలకు తెలుసని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా తమవేనంటూ చెప్పుకోవడం సరికాదని ఆయన అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, అభివృద్ధి పనుల్లో ఎవరు కృషి చేశారో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో అధికారానికి మూలం ప్రజలేనని, ప్రజల ఓటు హక్కును ఎవరూ తక్కువ చేసి చూడలేరని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం ప్రతి ఆరోపణకు పారదర్శకంగా సమాధానం చెప్పాలని కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ పక్షాన ఓటర్ల జాబితాలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మార్పులు, ఓటర్ల తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు లేఖను అందజేశారు.దఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, జిల్లా, నగర కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి జిల్లా ఎస్పీ నితికా పంత్..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28: (విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని,వాటికి చట్టపరమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ గారికి నేరుగా వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ సావధానంగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా, నిర్ణీత సమయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ అందిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# అక్కినేని జయంతి వేడుకల్లో అలరించిన 'ఆ పాట మధురాలు'

- 'నా ప్రపంచ యానం-నా ఆలోచనలు-నా అనుభవాలు' పుస్తకం ఆవిష్కరణ



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : శ్రీ ధృతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన 'ఆ పాట మధురాలు' సంగీత విభావరి ఘనంగా జరిగింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సాగిన కార్యక్రమంలో 80కి పైగా పాత–కొత్త గీతాలను ప్రముఖ, సీనియర్ గాయనీ గాయకులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో రచయిత, విశ్లేషకుడు, సామాజిక సేవకుడు లయన్ పేరి నాగేశ్వరరావు రచించిన 'నా ప్రపంచ యానం–నా ఆలోచనలు–నా అనుభవాలు' పుస్తకాన్ని తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిండికేట్ బ్యాంక్ మాజీ అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వరరావు, పణిగిరి సాయిబాబా టెంపుల్ చైర్మన్ శ్రీనివాస నాయుడు, సమస్త అధ్యక్షుడు కళా జనార్ధన్ మూర్తి, కందాళ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. నాగేశ్వరరావు–విజయలక్ష్మి దంపతుల సేవా, సాహిత్య కార్యక్రమాలను పలువురు అభినందించారు. వారి మనవరాలు ధృతి(యునైటెడ్ కింగ్‌డమ్), మనవడు ఇషాన్(అమెరికా) ఎనిమిదేళ్ల వయస్సులో పుస్తకానికి ముందుమాట రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల మృతి చెందిన గాయకుడు వడ్లమాని హరికృష్ణకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. గాయకులు పి.వి.రమణమూర్తి, ఎం.బి.రవికుమార్, కళ్యాణి దేశ్‌పాండే, ప్రసన్న విజయ్‌కుమార్, సౌమ్య, సవిత శ్రీ, పేరి నాగేశ్వరరావు–విజయలక్ష్మి దంపతులు గీతాలను ఆలపించి అలరించారు.

## కొండపాక మండల కేంద్రంలో ఆయుర్వేదిక్ ఆసుపత్రి సిబ్బంది ఎక్కడ?

సిద్దిపేట జిల్లా ప్రతినిధి విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 28 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల కొండపాక మండలం గత 25 సంవత్సరాల నుండి ఆయుర్వేదిక వైద్యశాల ద్వారా చాలామందికి చికిత్స అందించే హాస్పిటల్ మూతబడి ఆరు మాసాలు గడుస్తున్న డాక్టర్ ట్రాన్స్ఫర్ అవడం తరువాత సిబ్బంది కూడా ఎవరు లేకుండా ప్రస్తుతానికి తాళం వేసింది. రోగులు వచ్చి పోతున్నారు కానీ తాళం తీయడం లేదు ఆసుపత్రి తీసేసారా ఉందా అన్న సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు గతంలో ఉన్న రజిని అనే డాక్టర్ ఉన్నప్పుడు మాత్రమే హాస్పిటల్ ఆమె డిప్టేషన్ పై సిద్దిపేట వెళ్లిన తర్వాత ప్రస్తుతానికి తాళం వేసి మూసి ఉంది. కలెక్టర్ గారు పలుమార్లు ప్రభుత్వఆస్పత్రి చెకింగ్ వస్తున్నారు కానీ ఈ ఆయుర్వేదిక్ హాస్పిటల్ గురించి పట్టించుకోవడంలేదని ప్రజలు అనుకుంటున్నారు ఇకనైనా వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆస్పత్రిని వెంటనే తిరిగి పునః ప్రారంభించాలని కోరుతున్నారు.

## గ్రామ అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేయాలి

*ఎంపీడీవో జి.కృష్ణయ్య కు వినతిపత్రం అందజేసిన సిందనూరు గ్రామ సర్పంచ్ ఇంద్రసేన గౌడ్*



అయిజ సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జి. కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో సిందనూరు గ్రామ సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవి రెడ్డి పాల్గొని గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ, కురుమ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరమని తెలిపారు. మొత్తం రూ.20 లక్షల అంచనా వ్యయంతో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు.గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు ఈ నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్ కోరారు. అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో తో విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం అందిన118 దరఖాస్తులతో పాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా అధికారులు సిబ్బంది మీ ప్రమాణం మొబైల్ యాప్ ద్వారా తమ హాజరును (అటెండెన్స్) తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డిఆర్ఓ స్వర్ణలత, జెడ్పి సీఈవో సుధీర్, మరియు జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లాలోని కాలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి జిల్లా అధికారులతో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం2026 ను పురస్కరించుకొని వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అవగాహన, సామాజిక అనుసంధానం, చట్టపరమైన హక్కులు, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నుంచి రక్షణపై అవగాహన, 29న తరతరాల మధ్య అనుబంధం, పరస్పర అభ్యాసం కార్యక్రమాలు, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య పరిరక్షణ, వాకథాన్, అక్టోబర్ 1న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం2007, నియమాలు2011 ప్రకారం వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న హక్కులు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్ 14567 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, పోలీస్ హెల్ప్‌లైన్ 100ను సంప్రదించవచ్చని తెలిపారు. వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ గౌరవం, భద్రత, సహకారం అందిస్తూ వారి సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ స్వర్ణలత, వయోవృద్ధుల సంక్షేమ అధికారి కాంతారావు, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ డి డి ఎ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకం పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యం..

*ప్రజావాణి కార్యక్రమంలో 11 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన ఎస్పీ టి. శ్రీనివాసరావు*



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి మరొక సమర్థ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన మొత్తం 11 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, ఐపీఎస్.స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు. ప్రతి అర్జీని శ్రద్ధగా ఎస్పీ పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో తక్షణం సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల నమ్మకం పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యమైనద అన్నారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 02 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు అన్ని పని దినాలలో మధ్యాహ్నం 03 గంటల నుండి సాయంత్రం 05 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చు, ఎక్కడైనా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో మమ్మల్ని సంప్రదించాలి అని పేర్కొన్నారు. భూ వివాదాలు, ఆస్తి సమస్యలు, కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టపరమైన పరిష్కారమే తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం అందిన ఫిర్యాదుల, భర్తల హరాస్మెంట్ కు సంబంధించి 01, గొడవలకు సంబంధించి 02, భూ వివాదాలు సంబంధించి 03, స్థలం ఆక్రమణకు సంబంధించి –02, ఇతర సమస్యలు 03, మొత్తం: 11 ఫిర్యాదులు స్వీకరించామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శకమైన , వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

# పాఠశాల, ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఉపాధ్యాయుల హాజరుపై ఆరా.. పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు లేకపోవడంపై అసంతృప్తి
- ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీకి ఆదేశం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచన





కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 29(విజన్ ఆంధ్ర) : పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. సోమవారం చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, బోధనా ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలను తనిఖీ చేశారు.

**పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు లేకపోవడంపై అసంతృప్తి**

చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందుగా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్.. విధులకు హాజరైన, సెలవులో ఉన్న ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై అవగాహన, అభ్యసన స్థాయిని స్వయంగా పరిశీలించారు. పదో తరగతి తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీయగా సరైన సమాధానం లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు నిరంతరం తరగతులకు హాజరై బాధ్యతాయుతంగా బోధించాలని సూచించారు. పదో తరగతి ఫలితాలు, విద్యార్థుల ప్రస్తుత ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

**ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వల పరిశీలన**

అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకోగా, సుమారు 50 నుంచి 60 మంది వరకు ప్రతిరోజూ వైద్య సేవల కోసం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న చికిత్స, మందుల పంపిణీ, వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్.. మందులను నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాల కోసం ముందుగానే ఇండెంట్ పెట్టి కొరత లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించిన కలెక్టర్ రోగులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా పరీక్షా కిట్లు అందుబాటులో ఉన్నాయని, డెంగ్యూ కిట్ల కోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టినట్లు సిబ్బంది వివరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన పరీక్షా కిట్లు, మందులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూసీనది పరిరక్షణతోనే హైదరాబాద్ భవిష్యత్తు

- ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్




హైదరాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : మూసీ నది, సహజ ప్రవాహ మార్గాలు, చెరువులను పరిరక్షించడంతోనే హైదరాబాద్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్(ఎఫ్.బి.హెచ్) చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్ అన్నారు. 1908 మూసీ వరదల బాధితులకు నివాళులర్పిస్తూ సోమవారం ఉస్మానియా జనరల్ ఆసుపత్రి(ఓజీహెచ్) ప్రాంగణంలోని చారిత్రక చింతచెట్టు వద్ద ఎఫ్.బి.హెచ్ ఆధ్వర్యంలో స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఐ విట్నెస్ అకౌంట్స్ ఆన్ రివర్ మూసి ఫ్లడ్స్ ఆఫ్ 1908' పుస్తకాన్ని వేదకుమార్, పరాశర్ ఆవిష్కరించారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని డా.ద్యావనపల్లి సత్యనారాయణ రచించారు. 1908 వరదలపై పరాశర్ లావణి ప్రదర్శించగా, చారిత్రక కథనాలను యువతకు ఫోటోలు, మ్యాపులు, యానిమేషన్ల ద్వారా పరిచయం చేయాలని వేదకుమార్ సూచించారు. ఎఫ్.బి.హెచ్ జనరల్ సెక్రటరీ శోభా సింగ్, సభ్యుడు ఆదర్శ్, కోఆర్డినేటర్ సయ్యద్ ఖైసర్, హరికిషన్, వేణుగోపాల్, ఆర్కిటెక్ట్ రామ్ రాజ్, జెబిఆర్ ఆర్కిటెక్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ అధ్యాపకులు సోనూ కుమార్, ప్రత్యూష, సిరీష, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ సెలక్షన్స్ విజయవంతం

- రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది క్రీడాకారుల ఎంపిక



కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 29(విజన్ ఆంధ్ర) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్–14 బాలుర, అండర్–17 బాలుర, బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు సి.ఆర్. క్లబ్ బాక్సింగ్ హాల్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అండర్–14 బాలుర విభాగంలో కే. సాకేత్ (2830 కేజీలు), టీ. మణికంఠ (3638 కేజీలు), జే. రేవంత్ కుమార్ (3840 కేజీలు), జే. హరీష్ (4042 కేజీలు), 4244 కేజీల విభాగంలో విజేతగా నిలిచిన క్రీడాకారుడు గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో ఆర్. గణేష్ (మైనస్ 46 కేజీలు), ఎం. గణేష్ (4648 కేజీలు), వి. సాయికిరణ్ (4850 కేజీలు), వి. తనుష్ (5052 కేజీలు), టీ. నాగరాజు (5254 కేజీలు), ఎన్. వర్షిత్ (5457 కేజీలు), బి. విశ్వేశ్ (5760 కేజీలు), జి. అభిరామ్ (6063 కేజీలు), బి. గణేష్ (6366 కేజీలు) గోల్డ్ మెడల్స్ సాధించారు. అండర్–17 బాలికల విభాగంలో కే. భావన (మైనస్ 42 కేజీలు), ఎస్.కే. షఫీ షరీన్ (4648 కేజీలు), ఎం. అమృత జాస్మిన్ (4850 కేజీలు), కే. సానియా (6670 కేజీలు) గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు మంచిర్యాల జిల్లా వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ పరంధామ రెడ్డి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరం, ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బౌసింగ్, అబ్జర్వర్ నరేష్, బాక్సింగ్ కోచ్ ఆర్. శ్రీనివాస్, బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మట్టపర్తి రమేష్ విజేతలను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రూ.11 లక్షలకు పైచిలుకు సొమ్ము మున్సిపల్ ఖాతాలో జమా

- పూర్తి స్థాయి విచారణ.. బాధ్యులపై చర్యలు
- మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఒకరు షాపుల అద్దె వసూళ్లలో రూ.11 లక్షలకు పైగా సొమ్ము దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు కమిషనర్ జానకీరామ్ సాగర్ తెలిపారు. ఈ వ్యవహారంపై గద్వాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.దుర్వినియోగమైన సొమ్మును మున్సిపల్ క్యాషియర్ విభాగంలో జమ చేసి, అనంతరం బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అయితే వ్యవహారం పూర్తిగా ముగియలేదని, అద్దె వసూళ్ల లావాదేవీలు, జాప్యానికి గల కారణాలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు. విచారణ అనంతరం బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

# గోధంగూడలో పడకేసిన పారిశుద్ధ్య పనులు

- శంకరిగారి ఈశ్వరమ్మ ఇంటి ముందు పాములు నివాసం
- సిసి రోడ్లపై పశువులను కట్టేయడంతో సమీప నివాసితులకు యమగండం
- 8వ వార్డుకు చెందిన ఎస్సీ కాలనీలో మోరీలు, వీధి లైట్లు లేవు
- సమస్యలను బయటి ప్రపంచానికి తెలుపడానికి వెళ్ళిన విలేకరులను బెదిరించిన గ్రామ సిబ్బంది సుభాని



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ( విజన్ ఆంధ్ర ) : విషపురుగులతో చెలగాటం ఆడవలసి వస్తుందని గోధంగూడ గ్రామ ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. ఇంత మధ్యన పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగులకు నివాసంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోగల గోధంగూడ గ్రామానికి విశ్వసనీయ సమాచారం మేరకు విలేకరులు వెళ్లారు. గ్రామ సిబ్బంది సుభాని విలేకరులు సేకరిస్తున్న ఫోటోలను అడ్డుకొని మీరెందుకు వచ్చారని బెదిరింపులకు పాల్పడ్డాడు. సదరు వ్యక్తి విలేకరుల తన మొబైల్లో వీడియో ఫోటోలు తీస్తూ గ్రామ సర్పంచ్ అనుమతి లేకుండా ఎందుకు వచ్చారని బెదిరించాడు. సర్పంచ్ భర్తను వివరణ అడుగగా విలేకరుల పేర్లు చెప్పుకొని మరెవరో వచ్చి గ్రామంలో ఫోటోలు వీడియోలు తీస్తారని అనుకున్నాను అని ఆయన తెలిపారు. కానీ గోధంగూడ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. అల్లాడి సత్తిరెడ్డి ఉప్పరి ఎల్లయ్య ఇంటి వెనకాల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినవి. వాటిని తొలగించే నాథుడు కరువయ్యాడని సమీప నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. నవీన్ గౌడ్ ఇంటిముందు సిసి రోడ్డుపై పశువులను కట్టేయడంతో గురుగందపరితమైన వాసన సమీప ఇండ్లలోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట దోమలు ఈగలతో సహవాసం చేయవలసి వస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎగిరే శంకరయ్య ఇంటి వెనకాల వాటర్ ట్యాంక్ దగ్గర పిచ్చి మొక్కలు వేపుగా పెరిగాయి. ఎన్ని మార్లు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేసిన స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతూరి నర్సింలు ఇంటిదగ్గర మోరీలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎనిమిదో వార్డుకు చెందిన ఎస్సీ కాలంలో వీధిలైట్లు మోరీలు లేక ఆ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శంకరి గారి ఈశ్వరమ్మ ఇంటి మదు పిచ్చి మొక్కలు వేపుగా పెరగడంతో పాములకు నివాసంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చి మొక్కలు వేపుగా పెరగడంతో పాములు తేళ్లు రాత్రిపూట సంచరించడంతో భయం భయంతో బతుకుతున్నామని ఆక్రోషం వెళ్లగక్కారు. పాతూరి పెంటయ్య ఇంటిముందు పశువులను సిసి రోడ్డుపైనే కట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదవ వార్డులో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట బయటికి వెళ్లాలంటే భయపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ కు పలుమార్లు సమస్యలను విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని సమస్యలను విలేకరులు ఫోటోలు వీడియోలు తీసిన అనంతరం గ్రామ సిబ్బంది స్పందించి పిచ్చి మొక్కలను తొలగించడం విశేషం.

## నారాయణ లో...ఘనంగా స్టూడెంట్ - లెడ్ -కాన్ఫరెన్స్

**-విశిష్ట అతిథిగా ఆర్ఎన్ డి సంగీత**

**-ముఖ్యఅతిథిగా డిప్యూటీ జనరల్ మేనేజర్ సిరాజుల రిజ్వానా ఇమ్రాన్**




హన్మకొండ జిల్లా బ్యూరోచీఫ్ : హన్మకొండ జిల్లాలో ఉన్న నక్కలగుట్ట లో నారాయణ స్కూల్ లో ఘనంగా స్టూడెంట్ -లెడ్ - కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎం రాజశేఖర్ ప్రకటన లో తెలిపారు, ఈ కార్యక్రమనికి విశిష్ట అతిథిగా ఆర్ఎన్డి సంగీత, ముఖ్య అతిథిగా నారాయణ విద్య సంస్థల(స్కూల్ విభాగం )డిప్యూటీ జనరల్ మేనేజర్ సిరాజుల రిజ్వానా ఇమ్రాన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా డి, జి, ఎం మాట్లాడుతూ....స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అనే,ఈ కార్యక్రమం విద్యార్థుల నేతృత్వంలో జరిగే సమావేశంగా పిలుస్తారన్నారు అదేవిధంగా విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు స్వయంగా వివరించడం జరుగుతుందన్నారు, విద్యార్థులలో కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం జరుగుతుందన్నారు, విద్యార్థులకు తమ అభ్యాసం పై పూర్తి ఆత్మవిశ్వాసాన్ని బాధ్యతను కల్పిస్తుంది అన్నారు,అనంతరం ప్రిన్సిపాల్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థుల తమ అభ్యాసాన్ని ప్రదర్శించే తీరును పూర్తిగా తల్లిదండ్రులు గమనించవచ్చు అన్నారు, రానున్న రోజుల్లో కొత్త కొత్త నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం ఎంతగానో పెరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎన్ డి సంగీత, ప్రిన్సిపాల్ ఎం రాజశేఖర్, ఈ కిడ్జ్ కోఆర్డినేటర్స్ శిరీష, చామ్స్ కోఆర్డినేటర్ శ్యామల, హై స్కూల్ కోఆర్డినేటర్ సాయి కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు జ్యోతి, గౌతమి, సరిత, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వచ్చే నెల ఒకటో తారీకు నుండి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 28 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లాలోఈమధ్య కురిసిన వర్షాలతో జిల్లాలో డెంగ్యూ కేసులు పెరిగే అవకాశం ఉందని అన్ని గ్రామాలు మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్య కురిసిన వర్షాల వలన దోమలు వృద్ధి చెంది డెంగి కేసులు పెరిగే అవకాశం ఉన్నందున గ్రామాలు మరియు మున్సిపాలిటీలలో యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి డ్రైడే కార్యక్రమాల సక్రమంగా జరిగేలా చూడాలని అన్నారు చేయూత పింఛన్ల మంజూరు సంబంధించి ప్రతి మండలంలో 5 నుండి 10% అప్లికేషన్లను ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని అన్నారు ఈనెల 29వ తేదీ మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు జిల్లాలో సమావేశం నిర్వహించనున్న అందుకు సంబంధించిన పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని అన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారి ధాన్యాన్ని సేకరించినందుకు ముందస్తుగా అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమశాతం కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, తాలు తీసే యంత్రాలు సిద్ధం చేసుకోవాలని, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు, త్రాగునీరు, షెడ్ ఏర్పాటు చేయాలని అన అలాగే త్వరలో సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం ఉంటది కాబట్టి అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు./ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అక్షరాస్యత పెంచేందుకు అమ్మకు అక్షరమాల కార్యక్రమ నిర్వహణ

**- మహిళా సంఘాల సభ్యులందరూ చదువుకునేలా ప్రోత్సాహం**

**- జిల్లాలో ఉల్లాస్ పరీక్షలు విజయవంతం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో అక్షరాస్యతను పెంచే దిశగా అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో చదువుకున్న సభ్యుల సహకారంతో నిరక్షరాస్యులకు ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక మహిళ అక్షరాస్యురాలు కావడం అంటే ఒక కుటుంబంలో కొత్త వెలుగు తీసుకురావడమేనని పేర్కొన్నారు. ఇంటి ఇల్లాలు చదువుకుంటే తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడమే కాక విద్య ప్రయోజనాలను పొందే అవకాశం ఉందన్నారు. వయోజనులు కేవలం రాయడం, చదవడం మాత్రమే నేర్చుకోకుండా సారత్విక విద్యాపీఠం ద్వారా దూర విద్యలో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇతర స్థాయి వరకు కూడా చదువుకునేందుకు మంచి అవకాశంగా తెలిపారు. అక్షరాస్యత పెరిగింది అంటే ప్రతి ఒక్క కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఆస్కారము ఉందన్నారు. చదువు మధ్యలో ఆపేసిన, నిరక్షరాస్యులు ప్రత్యేక వయోజన విద్యా కేంద్రాల ద్వారా చదువుకొని జీవితంలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఇలా చదువుకున్న మహిళలకు ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అన్ని మండలాల్లో 33,783 మంది అభ్యర్థులకు గాను 24,832 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నాలుగు మునిసిపాలిటీలకు సంబంధించి 3077 మంది అభ్యర్థులకు గాను 2564 మంది పరీక్ష రాసినట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్‌ను ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో ( విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 28 జ్ఞానేశ్ కుమార్‌ను ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధంగా 25 కోట్ల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

# తెలంగాణ బీజేపీకి కొత్త సారధి.?

**- మళ్లీ బండికే పగ్గాలు..!**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర/ తెలంగాణలో ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాల దృశ్య బిజెపి శ్రేణులు కొత్త మార్పు కోరుకుంటున్నా రు అన్న విషయంలో అతిశక్తి లేదు. ఈ మధ్యన బిజెపి దూకుడు కూడా తక్కువయిందని చాలా మంది కార్యకర్తలు ఒకరి చెవిలో ఒకరు కొరుక్కోవడం మొదలైంది అందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతానికి మన తెలంగాణ రాష్ట్రంలో కొత్త నాయకత్వం అవసరమన్నట్టుగా భావిస్తుంది అందుకే ముందడుగు దిశగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి ఇది ఒకవేళ నిజమైతే పెద్ద మార్పే వస్తుందన్న పలువురు అభిప్రాయపడుతున్నారు అందుకే బీజేపీ నాయకత్వం కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. మోదీ 4.0 లో భాగంగా దక్షిణాది రాష్ట్రాలపైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. ఈ సారి తెలంగాణపైన భారీ ప్లాన్ తో సిద్ధం అవుతున్న బీజేపీ అధినాయకత్వం కీలక మార్పుల దిశగా కసరత్తు చేస్తోంది.బిత్వరలోనే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నాయకత్వ మార్పుకు సమాయత్తం అవుతోంది. తెలంగాణలో బీజేపీ కొత్త స్కెచ్ సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ నాయకత్వమే నేరుగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ఆపరేషన్ తెలంగాణ అమలుకు నిర్ణయించింది. తెలంగాణ కేంద్రంగా కొత్త నిర్ణయాలకు బీజేపీ అధినాయకత్వం సిద్ధం అవుతోంది. అందులో భాగంగా జనవరిలో రాష్ట్ర పార్టీ బాధ్యతలు మార్పు ఉంటుందని పార్టీలో ముఖ్య నేతల మధ్య చర్చ కొనసాగుతోంది. 2028లో తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికలపైన ఈ సారి బీజేపీ హైకమాండ్ ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. హర్యానా, పశ్చిమ బెంగాల్ లో అమలు చేసిన ఫార్ములాతో తెలంగాణలో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. ఇందుకోసం తాజాగా ఇంఛార్జ్ లను నియమించింది. ప్రస్తుత చీఫ్ రామచంద్రరావు కు తటస్థులు, జెన్ జీని పార్టీ వైపు తిప్పే బాధ్యతలను అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అందులో భాగంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో దిగనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. గత అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీకి పెరిగిన సీట్లు, ఓట్లతో వచ్చే ఎన్నికల కోసం ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే కలిసి వస్తుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. దీంతో.. పార్టీ అధ్యక్ష బాధ్యతలు తిరిగి బండి సంజయ్ కు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లుగా పార్టీ ముఖ్య నేతల సమాచారం. బండి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో దూకుడుగా వ్యవహరిస్తూ పార్టీలో జోష్ పెంచటంతో పాటుగా గ్రేటర్ లో దాదాపు 50 మంది కార్పోరేటర్లను గెలిపించుకున్నారనే అంశం ఇప్పుడు ప్రస్తావనకు వస్తోంది. పార్టీ నేషనల్ చీఫ్ నితిన్ నబీన్ సైతం తెలంగాణ పైన ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం.

## జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్. ప్రక్రియలో అవకతవకలపై నిరసన ర్యాలీ

**- కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలి...**

**- డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి....**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటు హక్కు సంరక్షణ కోసం ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆదేశానుసారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.డీసీసీ అధ్యక్షుడు మలిచేటి రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్ఐఆర్.ప్రక్రియలో అక్రమాలు అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న, కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వం,బీజేపీ, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి ప్రతీకగా రూపొందించిన రావణాసురుడి పోలుస్తూ మోదీ తో దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది, ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రజల ఓటు హక్కును ఏ విధంగానూ బలహీనపరిచే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల ఓటుతో వస్తుంది..ఆ ఓటు హక్కు స్వేచ్ఛగా,నిష్పక్షపాతంగా వినియోగించుకునే వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉంది అని పేర్కొన్నారు. అలాగే ఎన్నికలు కేవలం ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియ కాదని, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ప్రతీక అని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,నిష్పక్షపాత వైఖరి తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు కు వినతిపత్రం అందజేశారు. ఏస్ఐఆర్.ప్రక్రియపై సమగ్రంగా పరిశీలించి,ప్రజల అనుమానాలను నివృత్తి చేసే విధంగా పారదర్శక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్,గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్లు రామేశ్వరమ్మ కుర్మన్న,గౌస్, మద్దిలేటి,జనరల్ సెక్రటరీ శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, మధు నాయుడు,ధరూర్ రవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28,(విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ట్రైనీ కలెక్టర్ జోస్టిన్ జోల్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని దహెగాం మండలం రనవెల్లి గ్రామానికి చెందిన కోలే స్వర్ణలత తన భర్త చనిపోయినందున అతని పేరిట ఉన్న భూమిని తన పిల్లల పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జన్కపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి గ్రామంలో రోడ్ ఆక్రమణతో పాటు బతుకమ్మ గద్దెని కూల్చి స్థలం ఆక్రమించుకొని స్థలానికి పెంచన్ ఏర్పాటుచేసి ప్రధాన రహదారికి వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం మాణిక్ గూడకు చెందిన జాదవ్ లలితభాయి తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లింగాపూర్ మండలం పీర్లతండకు చెందిన పంచాయతీ సర్పంచ్ భానోత్ కృష్ణ, ఉపసర్పంచ్ బోడ సీత లు కలిసి వార్డు మెంబర్లను సమావేశనికి పిలవకుండా, ఆమోదం లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానపల్లి మండలం రుద్రపూర్ గ్రామానికి చెందిన కల్పన తన పేరు మీద ఉన్న భూమికి సంబంధించిన వివరాలను ఆన్లైన్ లో నమోదుచేసి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ గ్రామానికి చెందిన బొమ్మరే మహేష్ తాను దివ్యాంగుడిని అని, నిత్యవసరం కోసం బయటికి వెళ్లడానికి తనకు ఈ.వి. బైక్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చోర్‌పల్లి గ్రామానికి చెందిన మిట్ట మల్లయ్య కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకోడానికి ప్రయత్నించగా, జిల్లా కలెక్టర్ స్పందించి మిట్ట మల్లయ్య తన కూతురు గోలెం సమత పేరిట ఉన్న భూమిని తన పేరిట మార్చాలని దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయం సివిల్ మేటర్ కావడంతో పాటు పిఓ ఐటిడిఎ ఏజెన్సీ కోర్టులో గోలెం సమత 2020లో కేసు నమోదు చేయడం వల్ల ఈ విషయాన్ని ఏజెన్సీ కోర్టులో తేల్చుకోవాలని నిర్దేశించారు. సదరు మిట్ట మల్లయ్య స్వయంగా తన కూతురు, కొడుకుల పేరిట 2024 జూన్ లో భూమిని పార్టిషన్ గా బదలాయింపు చేశారని, అక్టోబర్ 3వ తేదీన కేసు ఏజెన్సీ కోర్టులో విచారణకు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ట పాలు చేయడమే కాంగ్రెస్ నైజం..

**- ఓటమి భయంతోనే ఓటు చోరీ డ్రామాలు..!**

**- వరుస ఓటములతో దేశ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ..**

**- జిల్లా బిజెపి అధ్యక్షుడు రామాంజనేయులు**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బిజెపి పార్టీ కార్యాలయము(డికె.బంగ్లా నందు)లో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం (సిఈసి) అత్యంత పారదర్శకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం వారి రాజకీయ దివాళాకోరతనానికి నిదర్శనం అని విమర్శించారు.సుప్రీంకోర్టు తీర్పును కూడా గౌరవించరా అని, ఈ ఎస్ఐఆర్.ప్రక్రియ అంతా చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని మే 27, 2026 న గౌరవ సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీం కోర్ట్ ) స్పష్టమైన తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టే ఈ ప్రక్రియ చెల్లుబాటు అవుతుందని చెప్పిన తర్వాత కూడా, కాంగ్రెస్ పార్టీ ఇంకా అబద్ధాలను ప్రచారం చేయడం అంటే న్యాయవ్యవస్థను సైతం అవమానించడమే అవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక రాష్ట్రంలో ఒక నీతి, ఢిల్లీలో ఒక నీతి ఉంటుందా, కేరళలో వారి సొంత హోంమంత్రే ఎస్ఐఆర్.ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, అక్రమ ఓటర్లను తొలగించడానికి వీలవుతుందని అంగీకరించారు. తెలంగాణ, కర్ణాటక, కేరళ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే వ్యవస్థ ద్వారా ఎన్నికలు జరిగితే ఒప్పుకుంటారు.కానీ వారు ఓడిపోయే రాష్ట్రాల్లో మాత్రం ఎన్నికల సంఘంపై నిందలు వేస్తారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అని అన్నారు. అక్రమ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎందుకు ఉలిక్కిపడుతోందని దేశ భద్రతకు ముప్పుగా మారిన అక్రమ చొరబాటుదారుల ఓట్లను, బోగస్ ఓట్లను తొలగించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఎందుకంటే ఆ బోగస్ ఓట్లే వారి రాజకీయాధారం. నిజమైన ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ) నేరుగా ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్లు సేకరిస్తారని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇంత పారదర్శకమైన ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోవాలని చూస్తోంది అని ప్రశ్నించారు. తెలంగాణలో ఈ ప్రక్రియను విజయవంతం కాకుండా చూసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు, ఎన్నికల సంఘానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావు, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు,బిజెపి సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వర్ రెడ్డి సద్దల కృష్ణ నరసింహ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 51 దరఖాస్తులు

***స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.అదనపు కలెక్టర్ దేవ సహాయం***



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 28ం: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 51 అర్జీలు, వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) పాండు, కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏవో) చంద్రశేఖర్‌లతో కలిసి అదనపు కలెక్టర్ దేవ సహాయం ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వచ్చేనెల నుంచి ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా హాజర్ నమోదు చేసేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దేవ సహాయం సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హెచ్‌సీఎల్ 50వ వార్షికోత్సవ వేడుకలు



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : హెచ్‌సీఎల్ గ్రూప్ 50వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ సంగీత కచేరీ నిర్వహించినట్లు హెచ్‌సీఎల్ గ్రూప్ అండ్ హెచ్‌సీఎల్‌టెక్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, శివ్ నాడార్ ఫౌండేషన్‌కు చెందిన 15 వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొని దేవిశ్రీ ప్రసాద్ పాటలకు ఉత్సాహంగా పాటలు పాడుతూ నృత్యాలు చేశారని తెలిపారు. నోయిడా, లక్నో, చెన్నై, విజయవాడ, మదురై తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం హెచ్‌సీఎల్ 50వ వార్షికోత్సవ సంగీత కచేరీల శ్రేణిలో ఆరవదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్‌టెక్ సీఓఓ రాహుల్ సింగ్, హెచ్‌సీఎల్‌టెక్ డిజిటల్ ఫౌండేషన్ సర్వీసెస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ గట్టు, హెచ్‌సీఎల్‌టెక్ డిజిటల్ బిజినెస్ సర్వీసెస్ గ్లోబల్ హెడ్, సీవీపీ పవన్ వడపల్లి పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

## ప్రజావాణికి 65 ఫిర్యాదులు..

**- ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి**

**- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**



గద్వాల సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజావాణికి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సీఎం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కూడా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి బుధవారం అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులందరూ సకాలంలో హాజరు కావాలని, నిర్లక్ష్యం చూపే వారికి మెమోలు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దివ్యాంగులకు సంబంధించిన పోస్టుల ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్స్ రిజిస్టర్ లను ఆయా శాఖల వారీగా ఈనెల 30వ తేదీలోగా సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ వస్తువులతో ప్రతి సోమవారం కలెక్టరేట్లో స్టాల్ ఏర్పాటు చేస్తుండడంతో అధికారులు, ప్రజలు, కలెక్టరేట్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నిజాంసాగర్ ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు ప్రాంగణంలోని చారిత్రాత్మక గోల్ బంగ్లాను అధిరోహించి, అక్కడ నుంచి ప్రాజెక్టు రమణీయ దృశ్యాలను, ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం, నీటి విడుదల వివరాలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి మట్టం, ఆయకట్టుకు నీటి సరఫరా తదితర కీలక అంశాలపై స్థానిక నీటిపారుదల శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంట మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు,ఓయస్ డి, రహమాన్, టి యు డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, జిల్లా కార్యదర్శి రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌లతో పాటు స్థానిక మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర - క్రైమ్

# డేటింగ్ యాప్‌లో పరిచయం..

## - బ్లాక్‌మెయిల్‌తో రూ.4.91 కోట్లు ఫట్!
## - హైదరాబాద్ లో సంచలన సైబర్ నేరం

తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర): డేటింగ్ యాప్ పరిచయం ఒక న్యాయవాది జీవితాన్ని చిన్నాభిన్నం చేసింది. పరువు పోతుందనే భయంతో ఏకంగా రూ.4.91 కోట్లు పోగొట్టుకున్న ఘటన హైదరాబాద్ లో వెలుగు చూసి సైబర్ నేరాల తీవ్రతను మరోసారి బయటపెట్టింది. హైదరాబాద్ కు చెందిన 27 ఏళ్ల న్యాయవాదికి 2025 ఆగస్టులో డేటింగ్ యాప్ ద్వారా 'దిశ' అనే పేరుతో ఓ మహిళ పరిచయమైంది. తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని చెప్పడంతో ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది, అది కాస్తా వ్యక్తిగత చాటింగ్, వీడియో కాల్స్ వరకు వెళ్లింది. ఈ క్రమంలో బాధితుడు తన వ్యక్తిగత విషయాలు, ఫోటోలు, వీడియోలను పంచుకున్నాడు.



**మొదట చిన్న మొత్తాలు.. ఆ తర్వాత కోట్లకు..**

తొలుత కుటుంబ అవసరాల పేరుతో చిన్న మొత్తాలు అడిగిన నిందితులు, ఆ తర్వాత అసలు రూపం బయటపెట్టారు. బాధితుడి ప్రైవేట్ చాటింగ్ లు, ఫోటోలు, వీడియోలను బయటపెడతామని, కుటుంబ సభ్యులకు పంపుతామని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. భయపడిన న్యాయవాది నిందితుల డిమాండ్లకు లొంగిపోయాడు. ఇలా 241 లావాదేవీల ద్వారా ఏకంగా రూ.4.91 కోట్లు బదిలీ చేశాడు. తన వ్యక్తిగత పొదుపుతో పాటు కుటుంబ పొదుపు మొత్తాన్ని కూడా ఇచ్చేశాడు. చివరకు తన ఫ్లాట్‌ను అమ్మి వచ్చిన డబ్బును సైతం నిందితులకు చెల్లించాడు. సెప్టెంబర్‌లో గచ్చిబౌలి ప్రాంతంలో నిందితులు పంపిన వ్యక్తులకు నేరుగా రూ.77 లక్షల నగదును కూడా అందించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

**చివరకు పోలీసులను ఆశ్రయించిన బాధితుడు:**

ఎన్ని డబ్బులు చెల్లించినా బెదిరింపులు ఆగకపోవడంతో బాధితుడు చివరకు కుటుంబ సభ్యులకు విషయం చెప్పి, సెప్టెంబర్ 19న నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. దీంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, చాటింగ్ ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

**ప్రజలకు పోలీసుల హెచ్చరిక:**

చదువుకున్న న్యాయవాదికే ఈ పరిస్థితి వస్తే సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన రుజువు చేస్తోంది. డేటింగ్ యాప్ లు, సోషల్ మీడియాలో పరిచయమైన అపరిచితులతో ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. బ్లాక్‌మెయిల్ కు గురైతే భయపడి డబ్బులు చెల్లించవద్దని, వెంటనే 1930 నంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, బెదిరింపు సందేశాలు, లావాదేవీల ఆధారాలను భద్రపరచాలని సైబర్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో నేనే గెలుపు గుర్రాన్ని అవుతాను: డాక్టర్ పిడమర్తి రవి

కాంగ్రెస్ పార్టీ నాకు నల్గొండ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో టికెట్ ఇస్తే నేనే గెలుపు గుర్రాన్ని అవుతానని లిడ్‌క్యాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు.లి ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ లో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రెండు దశాబ్దాల ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఉస్మానియా యూనివర్సిటీ, విద్యార్థి సంఘాల నాయకత్వం వహించడం మరియు అనేక అనుభవాల నేపథ్యంలో నల్గొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం అవకాశమిస్తే గెలిచి తీరుతానని అన్నారు. అనేకమంది పట్టభద్రులు ఇప్పటికే సంప్రదింపులు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ అవకాశం నాకు ఇవ్వాల్సిందిగా హై కమాండ్ కు విజ్ఞప్తి చేశారు. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ స్థాపించి రెండు దశాబ్దాలు అయిన సందర్భంగా అప్పటి ఉద్యమ జ్ఞాపకాలు విద్యార్థి ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. రెండు దశాబ్దాల ఉత్సవాలకు విశిష్ట అతిథిగా హాజరైన లిబీసీ లేబర్ కమిటీ అధ్యక్షులు చెరుకు మనికంట మాట్లాడుతూలి



ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఏకమై మరో బహుజన రాజ్య స్థాపన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఆర్ రాజేష్ నాయక్‌లి మాట్లాడుతూ గతంలో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాలలో పనిచేసిన అనుభవంతో తాను అతిపెద్ద గ్రామపంచాయతీకి సర్పంచ్గా గెలిచానని విద్యార్థి ఉద్యమాలు అనేక సమస్యలకు పరిష్కారం చూపుతాయని అన్నారు. దీఖీ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్ మాట్లాడుతూలి తెలంగాణ రాష్ట్ర సాధనలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ముందుండి పోరాడిందని తెలంగాణ ఉద్యమకారులకు రావాల్సిన సంక్షేమ పథకాలలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థి సమస్యలపై పోరాటం చేయడంలో బిఎస్ఎఫ్ ముందుంటుందని అన్నారు. బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ లెక్చరర్ అసోసియేషన్ నాయకులు దేవరపాగా శ్రీరాములు, బిఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, దీఖీ ప్రధాన కార్యదర్శి తోలు రాములు, దీఖీ ఉస్మానియా యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఆరికంటి శ్రీకాంత్,బహుజన సమతా ఫౌండేషన్ చైర్మన్ చింతమల్ల శోభన్ బాబు, బహుజన కళాకారులు గుడిపల్లి శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గుర్రం కోటేష్, మాదిగ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు జోగు గణేష్‌ఖ జీూజ చైర్మన్ పోలేన్ నరేందర్,దీఖీ వనపర్తి జిల్లా అధ్యక్షులు వద్దేమాన్ రాజారాం ప్రకాష్,దీఖీ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జ్ సాయిబాబా,దేవరకొండ నరేష్,దీఖీ ములుగు జిల్లా అధ్యక్షులు రాజశేఖర్,ూమీూ రాష్ట్ర నాయకులు మద్దెల రాజు, రావిశెట్టి ఉపేందర్, సతీష్, పోతుగంటి భరత్ తదితరులు పాల్గొన్నారు.


# ఓటర్ల జాబితాపై రాజకీయ రణం!!

## - ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ కన్నెర్ర
## - జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్ అంటూ తీవ్ర ఆరోపణలు
## - పారదర్శకంగానే ఓటర్ల జాబితా సవరణ- ఈసీ

హైదరాబాద్ (పొలిటికల్ డెస్క్), సెప్టెంబర్ 28: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో మండిపడింది. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థను కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా మారుస్తున్నారని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పూర్తిగా ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలా, "బీజేపీ ఏజెంట్"లా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేతలు నిప్పులు చెరిగారు.

**ఓట్ల తొలగింపు, చేర్పులపై తీవ్ర ఆందోళన**

ఓటర్ల జాబితా సవరణ ముసుగులో విపక్షాలకు అనుకూలంగా ఉండే వర్గాల ఓట్లను భారీ సంఖ్యలో తొలగించారని, అదే సమయంలో నకిలీ పేర్లతో దొంగ




ఓట్లను చొప్పించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఓటరు నమోదు నిబంధనలను ఉల్లంఘించి, ప్రజల వ్యక్తిగత వివరాల గోప్యతను గాలికొదిలేసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సంస్థ లోపల వ్యక్తమైన అంతర్గత భేదాభిప్రాయాలను, అభ్యంతరాలను సైతం తొక్కిపెట్టి ఒకే ఒక్కరి ఆదేశాలతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.
ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నారు కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేర రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కాంగ్రెస్ ముఖ్య నేతలు మాట్లాడుతూ, "జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగడానికి ఏమాత్రం అర్హులు కారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఆయన, కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తూ దేశ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ అవకతవకలపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించాలని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజాక్షేత్రంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**ఆరోపణలను ఖండించిన ఎన్నికల వర్గాలు**

కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం వర్గాలు కొట్టిపారేశాయి. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనల మేరకే సాగుతోందని, అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నాయి. రాజకీయ లబ్ధి కోసమే రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని స్పష్టం చేశాయి. ఈ పరిణామాలతో ఎన్నికల ప్రక్రియ చుట్టూ రాజకీయ దుమారం మరింత ముదిరింది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లు

**- కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు**
**- బ్లాస్టింగ్‌తో ఇళ్లు బీటలు.. దుమ్ము, ధూళితో ప్రజలకు అవస్థలు**
**- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



జిన్నారం/ సెప్టెంబర్ 28 విజన్ ఆంధ్ర న్యూస్) జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 210లో నిర్వహిస్తున్న రాక్సాండ్, ఏఏఏ స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. క్రషర్ యూనిట్లు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. క్రషర్ యూనిట్లలో రాత్రింబవళ్లు బ్లాస్టింగ్, రాళ్లను క్రషింగ్ చేయడం వల్ల భారీగా దుమ్ము, ధూళి వెలువడుతోందని తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, పెద్ద శబ్దాలు, ప్రకంపనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. క్రషర్ల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలపై పడటంతో పంటలు



దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ భూములపై దుమ్ము పేరుకుపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం పడుతోందని తెలిపారు. రహదారులపై క్రషర్ వాహనాల రాకపోకలతో కూడా దుమ్ము విపరీతంగా లేస్తోందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా రాయల్టీ పేరుతో అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నారనే ఆరోపణలు కూడా గ్రామస్థులు చేశారు. క్రషర్ యూనిట్ల నిర్వహణ, బ్లాస్టింగ్, రాయల్టీ చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే సంబంధిత క్రషర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ఈ సీతారం యాదవ్, మల్లేష్, కుమార్, భజరంగ్ సింగ్, నరసింహ, గణేష్, చంద్రయ్య, పాల్గొన్నారు.

# అనుమతులు రెండంతస్తులకు.. నిర్మాణం నాలుగంతస్తులా?

## - సూరారం సర్వే నంబర్ 115లో నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు
## - అనుమతి నివాస భవనం.. వినియోగం మహిళా వసతి గృహంగా!
## - క్షేత్రస్థాయి తనిఖీ చేసి వాస్తవాలు తేల్చాలని డిమాండ్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 28 (విజన్ ఆంధ్ర): సూరారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 115లో భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు, ప్రస్తుతం ఆ భవనాన్ని మహిళా వసతి గృహంగా వినియోగిస్తున్నట్లు ఆరోపిస్తూ పీ.వి. అభిషేక్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సెప్టెంబరు 28న గజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. భవన అనుమతులు, వాస్తవ నిర్మాణం, వినియోగ విధానంపై క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

**రెండు అంతస్తులకు అనుమతి.. నాలుగు అంతస్తుల నిర్మాణమా?**

సంబంధిత భవనానికి 2026 ఫిబ్రవరి 25న నిర్మాణ అనుమతులు మంజూరైనట్లు అభిషేక్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్కింగ్‌తో పాటు రెండు అంతస్తుల నిర్మాణానికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, వాస్తవంగా పార్కింగ్ ప్లస్ నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు. అనుమతుల్లో పేర్కొన్న వినియోగానికి భిన్నంగా భవనాన్ని మహిళా వసతి గృహంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అనుమతుల పత్రాలు, ఆమోదిత నిర్మాణ ప్రణాళిక, వాస్తవంగా నిర్మించిన




అంతస్తుల సంఖ్య, పార్కింగ్ సదుపాయాలు, ప్రస్తుతం భవనం వినియోగిస్తున్న విధానం తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**పలుమార్లు ఫిర్యాదులు.. చర్యలు ఎక్కడ?**

ఈ వ్యవహారంపై గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అభిషేక్ తెలిపారు. జూలై 27న ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు, జూలై 31న ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ నిర్మాణంపై సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తన ఫిర్యాదులపై ఇప్పటివరకు అధికారులు తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలని, అధికారులకు ముందుగానే సమాచారం అందినప్పటికీ నిర్మాణం పూర్తయ్యే వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న అంశంపైనా రికార్డులను పరిశీలించి విచారణ జరపాలని కోరారు.

**మహిళా వసతి గృహం నిర్వహణపై స్పష్టత ఇవ్వాలి**

నివాస అవసరాల కోసం మంజూరైన అనుమతులకు భిన్నంగా అదే భవనంలో మహిళా వసతి గృహం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అభిషేక్ కోరారు. భవన నిర్మాణ అనుమతుల్లో పేర్కొన్న వినియోగం, ప్రస్తుతం కొనసాగుతున్న కార్యకలాపాల మధ్య వ్యత్యాసం ఉందా? అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినట్లు లేదా భవన వినియోగంలో నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు తనిఖీలో తేలితే, వర్తించే మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

**భవనంపై తక్షణ తనిఖీ అవసరం!**

సర్వే నంబర్ 115లోని సంబంధిత భవనాన్ని అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులువాస్తవ నిర్మాణం మధ్య వ్యత్యాసం ఉందా? అదనపు అంతస్తులు నిర్మించారా? భవనాన్ని అనుమతించిన వినియోగానికే ఉపయోగిస్తున్నారా? పార్కింగ్ సదుపాయాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని అభిషేక్ కోరారు. గతంలో అందిన ఫిర్యాదులపై ఉన్న రికార్డులను కూడా పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ అనుమతులు, వాస్తవ నిర్మాణం, వినియోగ విధానంపై అధికారులు అధికారికంగా స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై న్యాయస్థానాలు నిర్దేశించిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని అభిషేక్ విజ్ఞప్తి చేశారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి - సి.ఎస్ సంజయ్ జాజు.

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం, సురక్షితమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుండి, కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లిజిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మలలి, సంబంధిత అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆరోగ్య పరిస్థితులు, మౌలిక వసతులను అధికారులు తరచుగా తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థుల హాజరుతో పాటు సిబ్బంది హాజరును కూడా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మానసిక స్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో జరుగుతున్న తనిఖీలను ఒకే సమగ్ర యాప్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను



ఆదేశించారు. ప్రతి సంస్థలో నిర్వహించే తనిఖీల వివరాలు, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలు, వాటి పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. సాంకేతికతతో పాటు క్షేత్రస్థాయి మానవ పర్యవేక్షణ కూడా సమాంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మంచి విధానాలు, ఉత్తమ పద్ధతులను జిల్లాల మధ్య పరస్పరం పంచుకోవాలని, తద్వారా అన్ని రెసిడెన్షియల్ సంస్థల్లో మెరుగైన ప్రమాణాలను అమలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యలను గుర్తించడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారాలు చూపే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వంటశాలలు, ఆహార పదార్థాల నిల్వ, పారిశుద్ధ్యం తదితర అంశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. క్యాంపస్ పరిసరాల్లో డ్రైనేజీ, పెస్ట్ కంట్రోల్, తాగునీరు, ఇతర మౌలిక వసతులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, భద్రతా చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, అవసరమైన చోట సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి, జిల్లా ఎస్ .సి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సునీత, జిల్లా ఎస్.టి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి ఛత్రు నాయక్, ఆర్.సి.ఓ లు, రెసిడెన్షియల్ పాఠశాలల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ...

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28:( విజన్ ఆంధ్ర) విద్యావ్యవస్థను పటిష్టం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఈ క్రమంలో విద్యాసంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ వసతి గృహాల నిర్వహణ పక్కాగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, విద్యాశాఖ పరిధిలో వేలాది గురుకులాలు, వసతి గృహాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలో 50 నుండి 70 వరకు వసతి గృహాలు ఉన్నాయని, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ అధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులకు ఆహార విషపూరితం/కలుషితం కావడం, పాము కాటు, ఎలుకల కాటు వంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనం, త్రాగునీరు నిరంతరం పర్యవేక్షించాలని, భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా, సంబంధిత జిల్లా కలెక్టర్లనే ప్రత్యక్షంగా బాధ్యులను చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంక్షేమ వసతిగృహం, ఆశ్రమ పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించి, క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు, సందర్శనలు నిర్వహించాలని తెలిపారు. గురుకులాలు, వసతి గృహాల పనితీరు, ఉపాధ్యాయుల/విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలు, పారిశుద్ధ్య ఫోటోలు, డైట్ చార్జెస్ చెల్లింపుల సమాచారాన్ని సమగ్రంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్, సెంట్రల్ డాష్‌బోర్డ్‌ను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. రాబోవు శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం సహా అవసరమైన అన్ని ప్రాథమిక వసతులను తక్షణమే సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాన్ని నిరంతరం పర్యవేక్షించేలా అధికారులకు సూచనలు చేస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా సంబంధిత అధికారులు, ఉపాధ్యాయుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని, విద్యార్థుల గైర్హాజరుపై వెంటనే స్పందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నదీమ్ ఉద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.